# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 34 సంచిక 9
పేజీలు 40
మే 2015

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................... ....... పేజీ**

భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ................................3
అమ్మమాట..........................................................5
ఆపద్బాంధవుడు .................................7
అక్షర స్వరూపునికి అక్షరాభ్యాసం .............9
సన్నిధిలో సంభాషణ .............................11
యోగవాశిష్ఠము ..................................13
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.....................15
పరిప్రశ్నేన సేవయా.............................16
నేనెరిగిన దైవం........................................ 18
గీతాధ్యయనమ్.................................19
శ్రీకృష్ణకర్ణామృతము.............................21
పరిరక్షణ ........................................23
అమృతబిన్దూపనిషత్ ..........................25
సద్గురు శ్రీయాత్రా దర్శన్.......................27
హనుమజ్జయంతి ...............................28
ఆశ్రమ పాఠశాల ..............................30
ధృవతార.........................................31
ఇంద్రద్యుమ్నుడు ..............................32
సత్సంగామృతం..................................33
పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు.....34
వైశాఖపూర్ణిమ విశిష్ఠత ......................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37
విష్ణు కథలు– భక్త కబీర్‌దాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషే చ్ఛతగ్ం సమాః ।
ఏవత్వయి నాన్యథేతోఽస్తి న కర్మ లిప్యతే నరే ॥
(ఈశావాస్యోపనిషత్ 2శ్లో॥)

వ్యవహారంతో కూడి జగత్తులో ఆవాసం చేసే సాధకులైనా, సామాన్యులైనా కర్మలు చేస్తారు. చేయక తప్పదు. చేయాలి కూడా.

అయితే విచారణీయాంశం కర్మ దేనికోసం చేస్తున్నాము అనే ధ్యేయాన్ని అనుసరించి కర్మరూపం, కర్త స్వభావం, ఫలరూపం ఆధారపడి ఉంటుంది. జగత్తు యొక్క ధ్యేయం ఈశ్వరతత్త్వమే కనుక జగత్తులో ఆచరించే కర్మలు, వ్యావహారిక కర్మలైనా, ఈశ్వరతత్త్వమునే ధ్యేయంగా ఆచరించాలి. అలా ఆచరిస్తూ జీవితకాలమంతా సాధన చతుష్టయ సంపదను సాధించే విధంగా సాధకులై ఇంద్రియ కర్మలను ఆచరిస్తూ జీవించాలన్నది ఉపనిషత్ బోధిస్తోంది. అయితే ఇది సాధ్యమా?

సాధకుని నిజస్వరూపం నశించనిది. కర్మ నిన్ను బంధించదు. నీ నిజ స్వరూపాన్ని అనుసరించి, వ్యావహారిక, భౌతిక, వాస్తవికతను విడచి, ఈశ్వర వాస్తవికతతో వెదకాలి, చూడాలి, గ్రహించాలి. విశ్వసించాలి, ఆచరించాలి. దానిని పొందటానికి ప్రయత్నించాలి. అదే ఆనందానుభూతి. అదే సాధన. అదే సాధకుని బాధ్యత. ఆ ప్రయత్నంలో ఉన్నవారెవరైనా ఈశ్వరతత్త్వం వారి స్వంతంకాక తప్పదు కదా!

ఒక కుండను నీటితో నింపి, దానిని ఒక తటాకంలో ముంచి, ఎన్ని చిల్లులు పొడిస్తే మాత్రం తటాకంలో నీరు కుండలో ప్రవేశించ లేదు కదా. అలాగే సాధకునిలో పూర్ణంగా సాధన భావం నిండి ఉంటే, జగత్తులో ఉన్నా, వ్యవహారంలో ఉన్నా ఏ కర్మ ఆచరిస్తున్నా, ఈశ్వర భావానికి భిన్నమైనది లోనికి ప్రవేశిస్తుందా?

జగత్తుగాని, పరాప్రకృతిగాని ఈశ్వర ధ్యేయానికి వ్యతిరేకంగా ప్రభావితం చేయగలుగుతుందా? అసంభవము. అందువలన అటువంటి సాధకుడిని ఏ కర్మ బంధించదు.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "భక్తి సగుణమైనది. విశ్వాసము నిర్గుణమైనది. గాఢమైన విశ్వాసం ఉంటేనే అది భక్తి అనిపించుకుంటుంది. భక్తి అనేక రకాలుగా ఉంటుంది. గోపికల భక్తి మధురభక్తి. గోపికల భక్తిని బహిర్గతము చేయడానికి శ్రీ కృష్ణ భగవానుడు, నారదుడు కలసి ఒక చిన్న కథను నడిపించారు.



శ్రీ కృష్ణ పరమాత్ముడు తనకి కలిగిన శిరోవేదన నివారించడానికి ఎవరైనా భక్తుని పాదధూళి తీసుకురమ్మని నారదుని ఆదేశించాడు. మరి నారదుడు భక్తుడే కదా! ఆయన తన పాదధూళిని సమర్పించ డానికి పూనుకోలేదు. నేనే మహాభక్తుడను అనే అహంకారము జనించలేదు. మహా భక్తులకోసం అన్వేషణ ప్రారంభించాడు. విషయం గోపికలకు తెలిసింది. వారు వెంటనే తమ పాదధూళిని శ్రీ కృష్ణ పరమాత్మునికి అందజేశారు. అదీ నిజమైన మధుర భక్తి అంటే.

శ్రీ కృష్ణ పరమాత్మునికి గోపికలు సర్వసమర్పణ చేసుకొని ఆయనను దైవంగా భావించారు. ఆయన కోరినది సమర్పించారు. అంతేగానీ, తమ పాదధూళి అపవిత్రమైనది కదా దానిని తమ ఆరాధ్య దైవమైన స్వామికి సమర్పించవచ్చునా అనే సందేహము కలుగలేదు. చూశారా అటువంటి మధురమైన భక్తి గోపికలది.

పాందువ్వలో రాజు గారు శ్రీ బాబూజీ మహరాజ్ చేతినుండి ఐస్‌ఫ్రూట్ తస్కరించి, గోపబాలురు అదేవిధంగా శ్రీకృష్ణ పరమాత్మతో ఆడుకునేవారు కదా అని రాజుగారు చెప్పిన సందర్భాన్ని జ్ఞాపకం చేస్తూ మరి నీ భక్తి గోపికలు, గోపబాలుర భక్తితో పోల్చ తగినదిగా ఉందా? అంతటి స్థితికి ఎదిగిన తరువాత అటువంటి ప్రవర్తన దానికి తగ్గట్టుగా ఉంటుంది సుమా! అన్నారు. సత్యగురువు తమను ఆశ్రయించిన శిష్యులకు ఇటువంటి హెచ్చరికలు చేస్తారు.

మీకు సద్గురుమూర్తిని దర్శించాలనే ఆవేదన, వారి బోధవినాలనే ఆకాంక్ష, వారి దర్శనభాగ్యం లభించకపోతే ఎంతటి విరహ

వేదన పొందుతారో సద్గురుమూర్తికి కూడా గోపికలు, గోపబాలురవంటి శిష్యులను నిరంతరము దర్శించాలని ఆవేదన, తపన అంతకన్నా ఎక్కువగా ఉంటుంది. కానీ కపట భక్తులంటే మాత్రం ఉండదు సుమా!

అందువలననే నేను ఈ మధ్య తరచుగా హెచ్చరికలు చేస్తున్నాను. నా విలువైన కాలాన్ని ఇంతవరకు మీ కుటుంబ సమస్యల పరిష్కారానికి, వ్యక్తిగత సమస్యలకి వినియోగించి వృధా చేసుకున్నాను. ఇక ముందు అటువంటి సమస్యలు తీర్చుకోవడానికి ఎవరైనా వచ్చి ఉంటే నా కాలాన్ని వృధా చేయదల్చుకోలేదు. తత్త్వ విచారణ కోసమైతే ఎంత కాలాన్నైనా మీకు ఇవ్వగలను.

ఈ విధంగా మీ శ్రేయస్సు కోరి, నేను హెచ్చరికలు చేస్తూ ఉంటే "బాబుగారు ఈ మధ్య కోపంగా ఉంటున్నారు" అనే మాటలు కూడా నా చెవిన పడుతున్నాయి, మామిడి పండు మామిడికాయ అవుతుందిటయ్యా! మీ అందరి శ్రేయస్సు కోరి, మీ అందరిని ఉద్ధరించ డానికి మీకిక్కడ చక్కని ఆశ్రమాన్ని ఏర్పరచి, మీకు కావల్సినవన్నీ అందిస్తూ ఉంటే మీకు కష్టంగా ఉంది. మీరు నన్ను దర్శించకుండా ఉండలేక పోతున్నారు. మీ ఆవేదన చూసి మిమ్మిల్ని చూడకుండా నేనుండలేక పోతున్నాను. దీనికేదైనా పరిష్కారమార్గము ఆలోచించాలి.

నేను జన్మకు వచ్చినందుకు ఏ ఒక్కరినైనా ఉద్ధరించగల్గితే నేను వచ్చినపని పూర్తయినట్లుగా భావిస్తాను. ఎంత బోధచేసినా మానవుల తత్త్వాలు మారాలికదా! ఒక భరిణెలో ఈగలను పట్టి ఉంచామనుకోండి అవి ఆ భరిణెలో బందీగా ఉన్నంతసేపూ భరిణెలోనే ఉంటాయి. కానీ మూత తీయగానే అవి ఎగిరిపోయి వాటి సహజ స్థావరమైన మలిన పదార్థాలనే గ్రోలుతాయి. అలాగే సత్యగురువుని ఆశ్రయించి ఉన్న భక్తులు ఆ గురుసాన్నిధ్యాన్ని వదిలితే వారి దృష్టి ప్రాపంచిక విషయాదులపైకి పోకుండా ఉండాలికదా! అందువలననే మీరాశ్రయించిన సద్గురుమూర్తి యందు పరిపూర్ణ భక్తి, శ్రద్ధలు కలిగి ఉండాలి. గోపికలవంటి మధురభక్తి గానీ లేక హనుమంతుడి వంటిదాస్యభక్తి గానీ కలిగివుండి 'గురువే నా సర్వస్వము' అనే భావనతో ఆయన చెప్పినది చేయాలి అన్నారు" శ్రీ బాబూజీ మహరాజ్.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## (21-3-2015 ఉగాది రోజున శ్రీమాతాజీవారిచ్చిన దివ్య సందేశం)

"కాలస్వరూపులైన శ్రీసద్గురుదేవుల కృపతో మనం 'శ్రీ జయ' నామ సంవత్సరానికి వీడ్కోలు చెప్పాము; శ్రీ మన్మథ నామ సంవత్సరం వచ్చింది అంటున్నాము. ఇంగ్లీషు వాళ్ళు జనవరి 1వ తేదీని క్రొత్త సంవత్సరారంభం అంటారు. అలాగే మన దేశంలోనే ఇతర భాషల వారు వేరు వేరు రోజులలో ఉగాది చేస్తారు. అయినా కాలం ఏమయినా మారిందా? మనం భగవంతుడికి ప్రణమిల్లుతూ క్రొత్త సంవత్సరంలో అడుగు పెట్టామని ప్రకృతి ఏమైనా మారిందా? పంచాంగ కర్తలు, జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతులు చెప్పడం విని, ఒక సంవత్సరం మారిందని మనం అనుకుంటున్నాము. మహాత్ములు మాత్రం కాలాన్ని మరచి ప్రకాశిస్తారు. మానవులు కాలాన్ని ఎప్పుడూ మరువరు. కాబట్టే వారు కాలమనే సుడిగుండంలో చిక్కుకుని, సుఖదుఃఖాలు, శీతోష్ణాలు, ఆకలిదప్పులు అనే షడూర్ములలో మునుగుతూ, తేలుతూ ఉంటారు.

మధ్యాహ్నమయిపోయింది - అకాలమయిపోయింది - ఆకలి వేస్తోంది ---ఈ వాసనలన్నీ మానవుణ్ణి పట్టి వదలటం లేదు. పండుగ రోజు వచ్చిందంటే అభ్యంగన స్నానం చేయటం, క్రొత్త బట్టలు ధరించడం, పిండివంటలు చేసుకుని తినడం మాత్రం చేసేవారున్నారు. కాని ఎన్ని కాకి స్నానాలు, గజ స్నానాలు చేసి ఏమి లాభం? దేహం మాత్రం శుద్ధి అయితే చాలదు. మనస్సు శుద్ధి చెందాలి. దానిని ఈ స్నానాలు ఏమీ చేయజాలవు.

మనస్సు శుద్ధి అవటానికి వేరే స్నానం ఉన్నదని శ్రీ గురుదేవులు సూచించారు. అది "గోవిందేతి సదా స్నానం; గోవిందేతి సదా జపం; గోవిందేతి సదా ధ్యానం; సదా గోవింద కీర్తనమ్; నామ స్మరణ భవ సాగర తరణమ్; కృష్ణం కృష్ణం గోవిందం రాధే" - (అని శ్రీమాతాజీ సంకీర్తన చేసి) ............ ఈ కీర్తన పాడుకోవడం, అర్థం చేసుకోవడం మాత్రం చాలదు. దానిని ఎంత వరకు ఆచరిస్తున్నాము, అనుభవిస్తున్నాము అనేది పాయింట్. ఈ గోవింద స్నానం చేయడానికి విధినిషేధాలు లేవు. ఇప్పుడు చేయాలి, అప్పుడు చేయకూడదు; వేడి నీళ్ళా? చన్నీళ్ళా? ఇవన్నీ అనవసరం. ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎంతైనా చేయవచ్చు. మామూలు స్నానానికి జలుబూ గట్రా చేయవచ్చు, కాని గోవింద స్నానంలో సొంతం

మునిగిపోయినా ఫరవాలేదు. అది మన భవరోగాన్నే హరిస్తుంది. మహాత్ములందరూ నిరంతరం గోవింద నామస్మరణ, జప ధ్యానాదులనే స్నానం చేస్తూ, ఆనందభరితస్వాంతులై ఉంటారు. వారు మనని కూడా అందులో హాయిగా గ్రుంకులిడమని తీసుకు వెళ్తున్నారు. కాని, మనం చంటిపిల్లల వలె బాహ్య దృష్టికి అలవాటుపడి, గోవింద నామ ధ్యాన స్నానాన్ని వదిలివేసి, 'ఈరోజు ఏం వండుకోవాలి? ఏ బట్టలు కట్టుకోవాలి?' అనే బాహ్య దృష్టికే ప్రాధాన్యతనిస్తూ, ప్రపంచ విషయాదులవైపే పరుగులు పెడుతున్నాము. ఎంత తినినా అది నాలుక దాటేవరకే; తరువాత ఆ పదార్థం రూప నామాలు కోల్పోతుంది.

మనందరికీ తెలివితేటలు, చదువులు ఎక్కువైపోయి, పంచాంగాలు మనమే పఠించి, అందులో చెప్పే 'సున్నల'కి భయపడి పోతున్నాము. మనం శ్రీగురుదేవుల అభయహస్త నీడలో ఉన్నాము. మనకి భయమెందుకు? చివరికి కొంతమంది సంఖ్యాశాస్త్రజ్ఞులు (న్యూమరాలజిస్టులు) అంటూ పెద్దలు పెట్టిన పేరులు కూడా మార్చేస్తున్నారు. 'నీడ నువ్వా? లేక నీడకి నువ్వు కారణమా?' అనే విషయాన్ని విచారణ చేసి, చర్చించుకోండి.

కాలం చాలా విలువైనది. దానిని జాగ్రత్తగా నిక్షిప్తం చేయకుండా వృథా చేసుకోకూడదు. కొండంత గురుదేవులు మనకి అండగా ఉన్నారు. మన్మథనామ సంవత్సరాన్నిచ్చారు. ఆ పేరు వినగానే అందరికీ గుర్తుకు వచ్చేది గుండెలను గాయపరచే పూలబాణాలు! కానీ గురుదేవులు 'మన్మథ' శబ్దానికి అర్థం చెబుతూ మనస్సుని మథించటం అని చెప్పారు. ఉపనిషత్తులు కూడా మనస్సుని మథించాలనే చెబుతున్నాయి. మనస్సుని ప్రపంచ విషయాలలో మథిస్తే హాలాహలమే (విషమే) పుడుతుంది. అదే భగవత్తత్వంలో మథిస్తే అమృతం వస్తుంది. కనుక దేనితో మనస్సును మథిస్తామనేది వారివారి జన్మ సంస్కారాలపై, వాసనలపై, సాంగత్యంపై ఒక్క ముక్కలో చెప్పాలంటే వారి పాత్రపై ఆధారపడి ఉంటుంది. మనస్సును గోవింద నామంతో మథిస్తే, జ్ఞాన నవనీతాన్ని ప్రసాదిస్తాడు గోవిందుడు. ఈ జ్ఞాన నవనీతం ఎక్కడి నుంచో రాలేదు. అది నీలో నుండే వచ్చింది. నీలో ఉన్న జ్ఞానామృతాన్ని నువ్వు గుర్తించటం లేదు. కాబట్టి గురుదేవులు నువ్వు దాన్ని గుర్తించేటట్లు చేస్తున్నారు.

(తరువాయి భాగం కోసం 36వ పేజీ చూడండి)

# ఆపద్బాంధవుడు

- మైలవరపు సుశీల

ప్రతిసంవత్సరం గుండుగొలను గ్రామంలో జరిగే శరన్నవరాత్రి మహోత్సవాలకు మా తాతయ్యగారితో కలిసి తప్పక వెళ్ళేవాళ్ళము. చిన్నమామ్మ ఇంట్లో దిగేవాళ్ళము. ఒకసారి తాతయ్య శ్రీబాబును శెలవు అడగటానికి వెళ్ళారు. శ్రీబాబు "ఇప్పుడు వెళ్ళవద్దు. ఉండిపో" అన్నారు.

"అవతల బోలెడు పొలం పనులు ఉన్నాయి. బాబు ఎప్పుడూ ఇలాగే ఉండిపొమ్మంటారు" అని మనస్సులో అనుకుని తాతయ్య, వెళ్ళడానికే నిశ్చయించి, గుండుగొలను బస్సులు ఆగే రోడ్డు దాకా వెళ్ళాడు. అక్కడ రోడ్డు కనబడటం లేదు. అంతా సముద్రం, అలలు నీరు ఎగిసి పడుతున్నాయి. తాతయ్యకి ఏమీ అర్థం కాలేదు. ఏమిటో దారి అంతా ఇలా ఉంది అనుకుని వెనుకకు తరిగాడు. ఇంటికి రాగానే కళ్ళు తిరగి పడిపోయాడు. ఒకటే వాంతులు, విరేచనాలు. స్పృహ లేదు. లంకా శేషగిరి రావుగారు వైద్యం చేశారు. మొత్తానికి స్వస్థత చేకూరింది.

శ్రీబాబు నవ్వుతూ వచ్చి "మామయ్యా! సముద్రం, అలలు ఎలా ఉంది?" అని అడిగారు. అప్పుడు మా తాతయ్య 'ఇంకెప్పుడూ బాబు వెళ్ళద్దు అంటే వెళ్ళకూడదు. వెనక్కి తిరిగి రాబట్టే కదా నాకు రక్షణ జరిగింది' అనుకుని క్షమాపణ కోరాడు.

శ్రీబాబు నవ్వుతూ "ఇదే రోడ్డు మీద ఏమైనా జరిగితే దారిలో ఏమయ్యేది? అందుకే నిన్ను వెళ్ళవద్దన్నాను మామయ్యా" అన్నారు.

ఒక్కసారి మా చిన్న తమ్ముడికి ఒంట్లో బాగుండకపోతే, వడాలి నుంచి మా అమ్మకు (కామేశ్వరమ్మ) రమ్మనమని, పిల్లవాడిని చూసి వెళ్ళమని కబురు వచ్చింది. మా అమ్మ బాబు దగ్గరకు వచ్చి, 'పిల్లవాడికి ఒంట్లోబాగోలేదు వెళ్ళిరావాలి బాబూ' అంటే "నీ ఇష్టం" అన్నారు బాబు. అమ్మో! బాబు ఇలా అన్నారు ఏం చేయాలా! అని అమ్మ ఆలోచిస్తుంటే బాబు "నువ్వు కూడా నాతోపాటు నా కారులో రా" అన్నారు. వెంటనే అమ్మ బయలుదేరి శ్రీబాబుతో విజయవాడ కారులో వెళ్ళింది. మద్ది నాగేశ్వరరావుగారింటికి వెళ్ళారు. బాబు అక్కడ చిన్నారిని (తబలా శాస్త్రి) పిలిచి, "నువ్వు ఎలాగో ఊరు వెడుతున్నావు కదా! కామేశ్వర్మమను కూడా రైలు ఎక్కించు" అని చెప్పి ఇద్దరినీ కలిసి పంపించారు స్టేషన్‌కు. చిన్నారి తనకు బందరు రైలు రాగానే "ఒదినా! నేను వెడతాను. ఈ

రైలు తప్పితే నాకు మళ్ళీ రాత్రిదాకా రైలు లేదు. నువ్వు నీ రైలు రాగానే ఎక్కు" అని చెప్పి ఒంటరిగా వదిలి వెళ్ళిపోయాడు. ఇదంతా స్టేషన్‌లో ఇద్దరు మగవాళ్ళు గమనించారు. నెమ్మదిగా మా అమ్మ దగ్గరకు వచ్చి, (చిన్నారి దగ్గర తబలా ఉండటం చూసి) "మీ రిద్దరూ నాటకాలు వేస్తారా?" అని అడిగితే, మా అమ్మ "లేదు భజనలు అవీ చేస్తాము" అని చెప్పింది. వెంటనే వాళ్ళిద్దరూ "మాది పొన్నూరు గ్రామం. మా ఊళ్ళో భజనలు జరుగుతూ ఉంటాయి. మీరు కూడా మాతో వస్తే మిమ్మల్ని తీసుకు వెళ్తాము" అన్నారు. మా అమ్మకు చాలా భయం వేసింది. "నేను రాను. మీ దారిన మీరు వెళ్ళండి" అన్నది. ఇంతలో రైలు వచ్చింది. అమ్మ రైలు ఎక్కింది. వాళ్ళు కూడా అమ్మను వెంబడించి గుడివాడ దాకా రైలులో వచ్చారు. అమ్మ రైలు దిగి వడాలి వెళ్ళటానికి బస్టాండ్‌కు రిక్షా ఎక్కబోతుంటే వాళ్ళు కూడా అదే రిక్షాలో కూర్చోబోయారు. అమ్మ భయంతో 'బాబూ! బాబూ!' అని కేకలు పెట్టి రిక్షాలో నుంచి వాళ్ళను ఒక్కతోపు త్రోసి 'రిక్షా! పోనీయ్' అని అరిచింది. ఎలాగో రాత్రి 10గం.లకు వడాలి చేరింది. మా అమ్మను చూసి మా అందరికీ పండుగ అయింది. నలుగురు పిల్లలమూ చుట్టూ చేరి పడుకున్నాము. ఇంతలో తెల్లవారింది!

శ్రీబాబు కారులో ప్రొద్దుటే 7గం.లకు వచ్చారు. కొంచెం సేపు కూర్చుని, "కామేశ్వరీ! వెంటనే బయలుదేరు" అన్నారు. గురుదేవుల ఆజ్ఞ అని అమ్మ వెంటనే కారు ఎక్కింది. మేమంతా కారు చుట్టూ చేరి, 'అమ్మా! అప్పుడే వెళ్ళిపోతావా? రాత్రే కదా వచ్చావు" అని బెంగగా ఏడ్చాము. నాకు మనస్సులో 'బాబు కరుణామయుడు అంటారే! అసలు జాలే లేదు' అని కూడా అనుకున్నాను. బాబు కారులో ప్రయాణం చేస్తూ మా అమ్మతో "నేను జాలిలేని వాడిని. నేను పిల్లాపాపలు లేనివాడిని' అన్నారు. 'అదేమిటి బాబూ! అలా అంటారు? మీరే కదా నన్ను నా పిల్లలను రక్షించేది!' అని అమ్మ అంటే, బాబు "చూడు మరి రాత్రి వద్దంటే వెళ్ళావు. ఆ రౌడీల బారిన పడితే నీ జీవితం ఏమైపోయేదో! అందుకే ఎలా ఉన్నావో అని ప్రొద్దుటే వచ్చాను" అన్నారుట.

ఆ తరువాత నాకు ఇదంతా తెలిసి "బాబూ! నన్ను క్షమించండి. మీరు జాలిలేనివారు అనుకున్నాను" అని మనసారా క్షమాపణ వేడుకున్నాను.

# అక్షర స్వరూపునికి అక్షరాభ్యాసము

- రావి శోభ

శ్రీకృష్ణ బలరాములు మధురా నగరానికి వెళ్ళి, కంసుని వధించిన తరువాత తల్లిదండ్రులను కలుసుకొని వారిని సంతోషపెట్టారు. వసుదేవుడు గర్గాది బ్రాహ్మణులచేత కొడుకులిద్దరికీ ఉపనయనం చేయించాడు. అలా బ్రహ్మచారులైన వారిద్దరినీ మహావైభవ రాశియైన కాశీనగర తీరంలో ఉన్న అవంతిపుర నివాసి, సకల విద్యావంతుడైన 'సాందీపని' అనే పండితుని దగ్గరకు విద్యాభ్యాసానికి పంపించాడు.

లోకంలో మానవులు ఎవరైనా సరే, గురువాక్యాన్ని అనుసరించి కాని, ఏ పనీ చేయకూడదు అని తెలపటం కోసమే, సర్వజ్ఞులు, జగద్గురువులు, పరిపూర్ణులై ఉండి కూడా గురువు వద్ద విద్యాభ్యాసం చేయటం కోసం వెళ్ళారు బలరామకృష్ణులు!

వారిరద్దరి నిర్మల వర్తనము, భక్తిని చూసి సాందీపని సంతుష్టుడై ఉపనిషత్తులు, ధనుర్వేదము, తంత్రము, మనుధర్మ శాస్త్రము, తర్కము, న్యాయము, రాజనీతి మొదలగు విద్యలన్నీ వారికి ఎంతో సంతోషంతో నేర్పించారు. నేర్పరులైనందున వారిద్దరూ 64విద్యలను 64రోజులలో నేర్చుకున్నారు. జగద్గురువులైన వారు గురుశిష్య న్యాయంతో ప్రవర్తించారు. కృతకృత్యులైన వారిద్దరూ గురుదక్షిణ క్రింద సముద్రంలో మునిగి, యమపురికి వెళ్ళిన వారి పుత్రుని తిరిగి తీసుకువచ్చి సాందీపునికి సమర్పించి, గురువుని ఆనందింపజేశారు...... ఆనాడు!

ఈనాడు.......... పరశురామయ్యగారు మధుపము వంటివారు. శ్రీబాబు దర్శనం లభించిన నాటి నుండి ఇతర చింతనలు మాని, శ్రీబాబు అందించే ఆత్మజ్ఞాన సుధను తానుగ్రోలి పరవశించటమే కాక, ఆ సుధానిధిని అందరికీ అందుబాటులో ఉంచాలని ఆరాట పడ్డారు. అందుకని వారు శ్రీబాబుతో .... "బాబూ! భారతీయ వేదాంత సారమంతా మీలో నిండి నిబిడీకృతమై ఉన్నది. ఆ ఆత్మజ్ఞాన సంపదను వివేకానంద వలె మీరు కూడా లోకమంతటికీ అందించటమే మీ అవతార కర్తవ్యం కదా! మరి ఇతర దేశాలకు వెళ్ళి ప్రచారం చేటాలంటే ఇంగ్లీషు బాగా రావాలి. రమణకి ఎలాగూ ఇంగ్లీషు నేర్పుతున్నాను కాబట్టి మీకూ చెబుతాను" అని పలకా బలపం ఇచ్చి, దీని మీద ' **A, B, C, D**' వ్రాసి

దిద్దమన్నారు.

"నాన్నగారూ! నేను జగన్మాత చేతిలో పరికరాన్ని. అమ్మ ఎలా నడిపిస్తే అలా నడుచుకుంటాను" అంటూ బుద్ధిమంతుడైన బాలుడిలా కూర్చుని, పలకని ఒళ్ళో పెట్టుకుని, బలపం చేతితో పట్టుకుని, పలకమీద ఉన్న అక్షరాలను చూస్తూ .... అలాగే ఉండిపోయారు!

పరశురామయ్యగారు శ్రీబాబుని చూస్తూ బలపం పైకెత్తిన బాబుతో "ఏమిటి బాబూ! అలాగే చూస్తున్నారు?" అని ప్రశ్నించారు. శ్రీబాబు "నాన్నగారూ! నాకు అమ్మ జగన్మాత ఈ అక్షరాలలో దర్శనం ఇస్తోంది" అని చెప్పారు.

"ఇది చాలా శుభ శకునం బాబూ! మీరు ఇహ అక్షరాలు దిద్దటం ప్రారంభించండి" అన్నారు పరశురామయ్యగారు. బలపాన్ని పైకెత్తి పలకపై ఆన్చి, మరల వెంటనే షాక్ కొట్టినట్లు తీసేసి, ఆ పలక వంకే కన్నార్పకుండా చూస్తున్న శ్రీబాబును చూసి, పరశురామయ్య గారు కంగారుగా "ఏమిటి బాబూ! ఏమైంది?"అన్నారు.

శ్రీబాబు "ఎక్కడ వ్రాయమంటారు నాన్నగారూ? బలపం పలక మీద పెట్టేసరికి మందహాస వదనంతో పలకంతా నిండి జగన్మాత దర్శనం ఇచ్చింది. ఈ బలపం ఆమె ముఖంపై ఎలా పెట్టను? పైగా ఆమె పకపకా నవ్వుతూ 'సకల విద్యాధికారిణిని అయిన నేను ఉండగా, నీకు ఈ పలకా బలపంతో పని ఏముందిరా?' అని అన్నది" అన్నారు శ్రీబాబు.

బాబు మాటలు విన్న పరశురామయ్యగారు ఆనందబాష్పాలతో శ్రీబాబును వాటేసుకుని "నిజమే బాబూ! అక్షర స్వరూపిణి అయిన జగన్మాతను మీలో అణువణువునా నింపుకున్న మీకు అక్షరాలు నేర్పటానికి ప్రయత్నం చేసిన నేను అవివేకిని. ఇప్పుడు నేను నేర్చుకున్న ఈ పాఠాన్ని జన్మలో మరచిపోను బాబూ!" అని అంటూ శ్రీబాబును ముద్దులతో నింపివేశారు పరశురామయ్యగారు.

అటువంటి ఆ అక్షరస్వరూపుని వర్ణన! అక్షర బంధం కాని అలౌకిక ఆనందం. ఆ ఆనందానికి మాటలు చాలవు, అక్షరాలు కనబడవు. ఆ ఆనంద స్వరూపుని చల్లని నీడలో ఆయన లీలలను నెమరు వేసుకుంటూ మన జీవితాలను కూడా ధన్యం చేసుకుందాం!!

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

25-12-85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "గురుదేవుడు చెప్పింది ఆచరించి గురులక్ష్యార్థము నందే మనస్సు నిలిపి తన జన్మని సార్థకం చేసుకున్న వారెవరైనా ఉన్నారా? చెప్పండి చూద్దాం?" అని ప్రశ్నించి "చూడండి శబరి తన గురుదేవుడు మాతంగ మహర్షి చెప్పినట్లు ఆచరించి శ్రీరామచంద్రుని దర్శించి మోక్షాన్ని పొందింది. నమ్మినవారికి నమ్మినంత, నమ్మని వారికి బూడిదే.



మహాత్ములను నమ్మాలి. వారు బోధించినది విని అర్థం చేసుకొని ఆచరించాలి. అప్పుడే మానవజన్మ సార్థకం అవుతుంది. 'మహాత్ములను ఎందుకు నమ్మాలి? వారిని నమ్మినంత మాత్రం చేత మానవులకి ఏం లభిస్తుంది? ఇప్పటినుంచే భగవన్నామాన్ని స్మరించటం ఎందుకు? 'హాయిగా 4 సార్లు తిని కడుపునొప్పి వస్తే అనుభవించు' అనే వారి మాటే నమ్ముతారు మానవులు.

విషయాదులు అనే మహారణ్యంలో గుణాలు, సంకల్పాలు, ఈర్ష్య, అసూయ, రాగద్వేషాలనే క్రూరమృగాల బారిన పడి దుఃఖించే మానవుడికి చేయూతనిచ్చి, చెక్కిళ్లపై జాలువారే కన్నీటిని తుడిచి తాము అనుభవ పూర్వకంగా ఆర్జించి అనుభవించే జ్ఞానాన్ని అందిస్తారు కనుక మహాత్ములని నమ్మాలి.

సారంలేని సంసారంలో కొట్టుకుంటున్నావు కాబట్టి సంసారాన్ని వదిలిపెట్టి సన్యసించమని ఏ మహాత్ముడూ చెప్పలేదు. నిజానికి గృహస్థాశ్రమం చాల గొప్పది. రాజయోగము మోక్షము పొందటానికి Shortcut. నిస్సారమైన సంసారాన్ని ప్రకాశింపచేసే సారమైన వస్తువుని చూడమంటున్నాడు భగవంతుడు. అమృతత్వానికి ఎగబ్రాకమంటున్నాడు. నీచత్వానికి దిగజారమనలేదు. కాని మానవుడు నిస్సారమైన సంసారాన్ని పట్టుకుని మునిగి తేలుతూ సంకటములకు గురియై అది సారమని భ్రమిస్తున్నాడు. ఇది ఎలా ఉందంటే ఒంటె ముళ్ళతో ఉన్న బ్రహ్మజెముడును కొరికి తింటుంది. ముళ్ళు నోటిలో గుచ్చుకొని రక్తము

వచ్చి పుండ్లు పడినా మానదు. దానినే తింటుంది.

సర్వజీవులయందు నిండియున్న ప్రకాశము ఒకటి ఉంది. అది తెలుసుకున్న వాడి జన్మ సార్థకం అవుతుంది. కర్మయోగియై దేశభక్తి కలిగి ప్రజలకు సేవచేసి సర్వజీవులను సమానంగా ప్రేమించినా సరే, లేకపోతే జ్ఞాని అయి పదిమందిలో ఏ ఒక్కజీవుడిని తరింపజేసినా సరే, ఆ ఇరువురిలో ఏ ఒక్కరిగా అయినా చాలు. మానవజన్మ సార్థకం అవుతుంది. 'అహంబ్రహ్మాస్మి' అనే మహావాక్యం అర్థం ఏమిటి? 'నేను బ్రహ్మను' అని. నీవు బ్రహ్మవు అయినపుడు నీ ఎదుట ఉన్నవాడు గాడిద అయ్యాడా? నారాయణోపనిషత్తు 'సర్వం నారాయణమయం' అని చెపుతోంది. మరి మానవులలో బ్రాహ్మణులు, శూద్రులు అనే వివక్షత ఎందుకయ్యా? ఏమండీ అవధాన్లు గారూ! మీరు అవధానం చేసేటప్పుడు ముందుగా ఎవరిని స్మరిస్తారు? మా గోవిందుడినే కదా! మరి ఆయన గొల్లవాడు కదా! శూద్రుడు కదా! ఆయన శక్తి వలననే కదా మీరు ప్రజ్ఞావంతులయ్యేది. మరి ఆయనలో శూద్రత్వం ఉన్నదా? వసిష్ఠుల వారి భార్య అరుంధతి ఎవరు? ఆవిడది ఏ కులం? హరిజన కులమేకదా! మరి ఆ మహాత్ములకి లేని కుల వివక్షత మానవులకి ఎందుకండీ!

శూద్రత్వము అంటే అజ్ఞానము. ఏకులానికి చెందినా జ్ఞానాన్ని పొందనివాడు శూద్రుడన్నమాటే కదా! బ్రాహ్మణుడై బ్రహ్మత్వాన్ని పొందుతావా? లేక శూద్రుడవై పొందుతావా? దాన్ని అర్థం చేసుకోండి. ధామత్వంలో ఇవేమీ ఉండవని నా రీసెర్చిలో తేలింది. పరమాత్ముడు సర్వవ్యాపకుడు. సాగరంలో నీరు గడ్డకడితే లవణం అవుతుంది. లవణం సాకారం. దాని రుచి నిరాకారం. ఏ రూపంలో ఉన్నా రుచి ఒకటే కదా! పరమాత్ముడు సాకారం. ఆయన కాంతి కిరణం నిరాకారం ఈ రెండింటికి రూపంలోనే తేడా! పరమాత్ముని ప్రేమించిన కొలది మనలోని కర్మబీజాలు రహితం అవుతాయి. ఒక బీజాన్ని భూమిలో నాటి జాగ్రత్తగా సంరక్షణచేసి నీరుపోసి పెంచితే మొక్క పెరిగి ఆకులు రెబ్బలు వేసి పూవులు పూసి కాయలు కాస్తుంది. నీరు సూర్యకాంతికి ఆవిరియై మేఘాలు ఏర్పడితేనే కదా వర్షం కురిసేది. అప్పుడే వృక్షాలు చక్కగా పెరుగుతాయి. అలాగే నీ మనస్సు పరమాత్ముని యందు నిలిపి ధ్యానిస్తే నీ ధ్యానం ఫలిస్తుంది" అన్నారు.

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

సిద్ధులు పాడిన యీ గీతాలే సిద్ధ గీతగా ప్రసిద్ధి చెందినవి.

"సిద్ధుల గీతాలు లేక సిద్ధ గీత జనకుని హృదయాన్ని గాఢంగా స్పందింప చేసింది, వెంటనే రాజుగారు ఉద్యానవనం నుండి బయటకు వచ్చి, మంత్రులను, పరిచారకులను పంపివేసి, వడి వడిగా వెళ్ళి, తన రాజభవనపు చివరి అంతస్తులో ఉన్నగదిలోకి వెళ్లి, ఒంటరిగా తలుపులు వేసుకొన్నారు. అక్కడ సిద్ధులు పాడిన సిద్ధ గీత అంతరార్థముపై, మనసులగ్నము చేసి, తీవ్రంగా విచారణ చేయటం ప్రారంభించారు.



సిద్ధ గీత మననం చేసుకొంటూ, తనలో తను యిలా అనుకొన్నారు. "ఏ విధముగా ఉనికి, సత్తా లేకుండా, సుఖ, దుఃఖాలు రెండు భ్రాంతియైన యీ జగత్తును యెలా నమ్మాలి, యే విధంగా ఆధారపడాలి? కాని యెందుకు నా మనసు దాని చేత మోసగించబడుతున్నదో, నాకర్థం కావటంలేదు. నాకంతులేని సంపద వున్నప్పటికీ, యెప్పుడూ చింతలు చికాకులతో కలత చెందుచున్నాను, నిత్యజీవితములో నా వంద సంవత్సరాల ఆయుర్ధాయం, తృణప్రాయము, కాని నా జీవితాన్ని గురించి, గొప్పగా పరిగణించాను, అగణనీయమైన యీ విశ్వంతో పోలిస్తే, నా సామ్రాజ్యము కేవలమొక అణువులాంటిది. నేను నా కోరికలకు, విషయ వాసనలకు, దాసోహమంటున్నాను, నా రాచరిక కాలము అతి స్వల్పమయినది.

ఒక అనాలోచితమైన వ్యక్తిగా, దీని మనుగడ భద్రమైనదని యెలా భావించగలుగుతున్నాను? ప్రస్తుత జీవితము క్షణికము, నాశనమయ్యేదైనా, వొక మూర్ఖునిలా దానిపై యెందుకు ఆధారపడి ఉంటున్నాను? దూరంగా వుండవలసిన యింద్రియాకర్షణలు చాలా సన్నిహితంగా కనిపిస్తున్నాయి, నాకత్యంత సన్నిహితమైన, అమరమైన, ఆత్మను, అజ్ఞానము వలన చాలా సుదూరంగా ఉన్నట్లు భావిస్తున్నాను. కనుక నాలోని అనిత్యమైన విషయాసక్తతకు స్వస్తి చెప్పి, అంతరాంతరములో వుండే శాశ్వతమైన ఆత్మతో ఒకటవాలి.

ఈ ప్రపంచములో ప్రతిదీ నశించేదే. ఇక్కడ యేదీ నిత్యమైనది కాదు, ప్రయోజనాన్ని యిచ్చేది కాదు, ఎందుకు? ఉన్నతులలో మహోన్నతులనుకొన్నవారు కూడ కాలగమనంలో అధమాధములుగా మారుతున్నారు. ఎక్కడ నుండి యీ మాయ (అజ్ఞానము) నా ఆత్మ నావరిస్తున్నది? నేను నా బాధల్లో, కష్టాల్లో వున్నప్పుడు, నా సంపద, సౌభాగ్యము, అంతులేని బంధువర్గం వల్ల ప్రయోజనమేమి? నా సంపద యావత్తు వొక నీటిబుడగ వంటిది. ఇది వొక అసత్యమైన, తాత్కాలిక దృశ్యము, ఎంతో మంది సామ్రాట్టులు, రాజులు, వారి సంపదతో కాలగర్భంలో కలిసిపోయారు. అమరత్వమనే మహాసాగరములో యెంతో మంది ఇంద్రులు, బుడగల్లా అంతరించారు, అందువల్ల దేనిలో కూడ సంపూర్ణమైన విశ్వసనీయత అనేది లేదు.

అసంఖ్యాకమైన భూసురులు కాలగర్భంలో కలిసిపోయారు అలాగే భూపతులందరూ మట్టిలో కలిసిపోయారు. కనుక జీవితము, దాని స్థిరత్వముపై యేమి నమ్మకముంచగలము? ఈ జగత్తే వొక సుదీర్ఘమైన స్వప్నములాంటిది, జ్ఞానేంద్రియములతో కూడిన యీ దేహము, మనసు యొక్క తప్పుడు ఊహ మాత్రమే. నేను యీ దేహము, విషయములు వాస్తవమని నమ్మితే, నన్ను నేను నిందించుకోవాలి. అసంఖ్యాకమైన విశ్వాలు, బ్రహ్మాలు, జీవులు వచ్చారు, కనుమరుగయినారు, కనుక "ఓ మనసా, నీ ఉనికికి స్థిరత్వమేది? నన్ను గురించి నా అభిప్రాయము, యితర వస్తువులపై భావన అంతా మనసు యొక్క తప్పుడు ఊహలు మాత్రమే నా అహంకారము, నన్ను స్వాధీనము చేసుకొన్నది.

కోరికలు, అహంకారము శరీరముతో అనుబంధము మూలంగా నన్ను నేను యీ అజ్ఞాన స్థితికి, దిగజార్చుకొన్నాను, నేనొక మూర్ఖుడను, నా జీవిత కాలము, క్షణ క్షణము తరిగి పోవుచున్నది. రేయింబవళ్లు గడిచిపోతున్నవి కాని సత్యమై, నాశరహితమైన ఆత్మతో, తాదాత్మ్యము నొందలేక పోతున్నాను. కాలమనే మాంత్రికుడు యీ ప్రపంచమనే క్రీడా రంగంతో మానవులను ఆటవస్తువులుగ చేసి, బంతుల్లాగ విసిరేస్తున్నాడు. నేనింత వరకు గడిపిన జీవితాలు చాలు, చాలు, నాకు విరక్తి కలిగినది.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

## మే 2015

4 సోమ : వైశాఖపౌర్ణమి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

9 శని : శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము. లీలా కళ్యాణము

13 బుధ : హనుమజ్జయంతి, శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, హనుమాన్‌చాలీసా పారాయణ

16 శని : మాసశివరాత్రి, శనిత్రయోదశి. పావులూరి బ్రాంచిలో శ్రీఅవధూతేంద్ర సరస్వతి స్వామివారి వార్షిక పుణ్యారాధన మహోత్సవములు. (వివరాలు 17వ పేజీలో చూడండి)

18 సోమ : అమావాస్య

27 బుధ : శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి అష్టమ వార్షికారాధన

## జూన్ 2015

2 మంగళ : జ్యేష్ఠ పౌర్ణమి, శ్రీ సద్గురుపాదపూజ.

11 గురు : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

15 సోమ : మాసశివరాత్రి, పావులూరి బ్రాంచిలో ఏకాహం.

16 మంగళ : అమావాస్య

### శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమవాస్తవ్యులు అయిన శ్రీమతి గాదె సీతాదేవి (సత్యనారాయణమూర్తిగారి భార్య) 20-4-2015 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 56 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము.

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

'అజ్ఞానం అంటే ఏమిటి?' అన్న ప్రశ్నకు సమాధానంగా సద్గురు దేవులు అందించిన బోధలో వివరిస్తూ "సత్యాన్ని మరచి త్రిపుటిలో ఇరుక్కోవటమే అజ్ఞానం" అన్నారు.



"ఏది సత్యమో తెలుసుకోవాలి. స్వప్నావస్థలో ఉన్నంత వరకూ తాను స్వప్నంలో దర్శించినదంతా సత్యమనే భావిస్తాడు. అది కేవలం భ్రమమాత్రమే. దానినే వేదాంత పరిభాషలో ప్రాతిభాసిక సత్యం అంటారు. సంధ్యవెలుగులో త్రాడును చూసి పాముగా భ్రమచెంది భీతి చెందటం ఈ కోవకి చెందినదే. అంతేకాదు ఒక గ్లాసుతో వేడిపాలు త్రాగటానికి ఇస్తే గ్లాసు వేడిగా ఉందంటారు. యదార్థానికి వేడిగా ఉన్నది పాలుగాని, గ్లాసు కాదు కదా! అందువలన ఈ రకమైన సత్యము కాదు మనం పొంద వలసినది.

పోనీ వ్యావహారికంగా తీసుకుందామా అంటే వ్యావహారిక సత్యం కూడా పరిణామంతో కూడినదే. యదార్థమైనది కాదు కదా! అనిత్య మైనదే. సత్యము అంటే చావు పుట్టుకలు లేనిది, పరిణామము లేనిది, నిత్యమైనదై ఉండాలి. అదే పారమార్థిక సత్యము. అది మరపు రావటమే అజ్ఞానము.

అన్ని క్రియలకు అజ్ఞానమే మూలము. కర్మకి కారణం - సంకల్పం, క్రియ, ఫలం అనేవి మూడు. బంధన అనేది ఫలం మీద ఆధారపడి ఉంటుంది. అది సుఖాన్ని ఇవ్వవచ్చు. లేక దుఃఖాన్ని కలిగించవచ్చు. సూర్యాస్తమయం కాగానే గాఢాంధకారం ఆవరిస్తుంది. ఆ చీకటిని తొలగించగల శక్తి ఎవరికి ఉంది? దీపం వెలిగించగానే, అంధకారం తొలగిపోతుంది.

అలాగే అజ్ఞానాంధకారం అనేది ఎలా కలిగింది? అది ఏ కర్మ వలన కలిగేది కాదు. కేవలం జ్ఞానం లోపించటం వలనే కలిగింది. దానిని తొలగించే ఏకైక మార్గం జ్ఞానమే. జ్ఞానము సిద్ధించే మార్గము గురువు

ఉపదేశమే. గురూపదేశము నందు ఆసక్తి కలగాలి. గురు వాక్యము నందు విశ్వాసం పెంపొందాలి. దానికి ఏకైక మార్గం చిత్తశాంతి. గురు లక్ష్యార్థ సాధనే చిత్తశాంతి, విశ్వాసము పెంపొందింప జేసే తరుణోపాయము. గురులక్ష్యార్థ సాధన చేసినప్పుడే ముముక్షువు అనిపించుకుంటాడు. మానవుడు ఎన్నో జన్మల పుణ్యం రాశీభూతమై ఈ మానవ జన్మ లభించింది. ఏ రూపముతో కూడిన జన్మలోనైనా 'నేను' అనేది మారనిది. అదే నేను మానవ జన్మలో కూడా 'తాను'గా ఉన్నది. అదే సర్వ వ్యాపకమైనది. దానిని గుర్తించటమే జ్ఞానము. అది గుర్తించనంత వరకూ కీటకమైనా, మానవుడైనా, ఎవరైనా ఒక్కటే సుమా! తిరిగి జన్మకి రాక తప్పదు!!

**పావులూరు శాఖలో శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి చతుర్వింశతి [40వ] పుణ్యారాధన మహోత్సవ కార్యక్రమములు**

1. 16-5-2015 శనివారం ఉదయం నుండి 21-5-2015 గురువారం ఉదయం వరకు అఖండ హరినామ సంకీర్తన.
2. 16-5-2015 నుండి 20-5-2015 వరకు ప్రతిరోజూ రాత్రి 7గం. నుండి 9గం. వరకు పూజ్యయోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీ మరియు శ్రీ శ్రీనివాస రామానుజదాసు వార్ల ప్రవచనము.
3. 17-5-2015 నుండి 19-5-2015 వరకు ప్రతిరోజు ఉదయం 7గం. నుండి నగర సంకీర్తన.
4. 20-5-2015 బుధవారం ఉదయం 8గం. సాముహిక కుంకుమ పూజలు మరియు 9-54ని॥లకు శ్రీ భక్తాంజనేయ స్వామి, శ్రీ హనుమత్ కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్ మరియు శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వాముల వార్ల మంగళ మూర్తుల చరప్రతిష్ఠ. అనంతరం శ్రీ అవధూతేంద్రస్వామివారి ఆరాధన పూజ, అన్నదానం.

భక్త మహాశయులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తరింతురు గాక!
వివరములకు - 94405 25600 ; 93465 35357

# నేనెరిగిన దైవం

- పెనుమాక నాగేశ్వరరావు

నే నెరిగిన దైవం, నే చూసిన దైవం, నే పిలిచిన పలికిన దైవం
నే కొలిచిన దైవం, నే నమ్మిన దైవం, నా తోడుగా నిలిచే దైవం
నే మరువని దైవం, నే విడువని దైవం, నను నడిపిన దైవం
స్వరమిచ్చిన దైవం, వరమిచ్చిన, నను మెచ్చిన శ్రీ సద్గురు దైవం

నే దర్శించిన దైవం, నే స్పర్శించిన దైవం, నను దీవించిన దైవం
నే పూజించిన దైవం, నే సేవించిన దైవం, నను కరుణించిన దైవం
నే కీర్తించిన దైవం, నే ప్రార్థించిన దైవం, నను లాలించిన దైవం
గుణమిచ్చిన, ధనమిచ్చిన, ప్రతిభిచ్చిన శ్రీ సద్గురు దైవం

హారతులొందిన దైవం, ఆనతులిచ్చిన దైవం, ఆశీస్సులిచ్చిన దైవం
కోర్కెలు తీర్చిన దైవం, కాంతులు నింపిన దైవం, దయ చూపిన దైవం
నా మనసెరిగిన దైవం, నా భవితనెరిగిన దైవం, గురుతెరిగిన దైవం
ధైర్యమిచ్చిన, స్థైర్యమిచ్చిన స్థాయి నిచ్చిన శ్రీ సద్గురు దైవం.



(గత సంచిక తరువాయి) # గీతాధ్యయనమ్ - రమణ ప్రసాద్

## జ్ఞానయోగం



నిష్కామ కర్మాచరణము వలన చిత్తం శుద్ధమవుతుంది. నిర్మల చిత్తంతో జ్ఞానం ఉదయిస్తుంది. ఇప్పుడు భగవానుడు జ్ఞాన యోగాన్ని అర్జునకు బోధ చేస్తున్నాడు.

"జనన మరణాలు లేని నేను, నా ఈశ్వర భావం విడిచిపెట్టకుండానే మాయాశక్తి వలన లోకంలో అధర్మం ప్రభవించినప్పుడు జన్మను ఎత్తుతాను.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8**

శిష్ట రక్షణకు, దుష్ట శిక్షణకు ధర్మ సంస్థాపనకు నేను అన్ని యుగాలలో అవతరిస్తాను. నా ఈ అవతార రహస్యం ఎరిగినవాడు తిరిగి జన్మించడు. అతడు నన్నే చేరుతాడు. అనురాగము, భయము, క్రోధము విడిచి నన్నే ఆశ్రయించినవారు పవిత్రులై నన్ను పొందుతారు. ఎవరు ఎలా ఆరాధిస్తే ఆరీతిగా నేను వారిని అనుగ్రహిస్తాను.

నేను కర్తను కాను, శాశ్వతుడను. అయినా మానవుల గుణ కర్మలకు తగినట్లుగా నాలుగు వర్ణాలు నేనే సృష్టించాను. నాకు కర్మలు అంటవు. వాటి కర్మఫలం అంటదు. ఇది గ్రహించినవారిని కర్మలు బంధించవు. పండితులు సహితం ఏది కర్మ, ఏది అకర్మ అని తెలియక తికమక పడుతున్నారు. ఆ కర్మ స్వరూపాన్ని వివరిస్తున్నాను.

**కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మయః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్ ॥ 18**

కర్మలో అకర్మ, అకర్మలో కర్మ చూసేవాడు బుద్ధిమంతుడు, యోగి.

**యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః ।**
**జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥ 19**

ఫలాసక్తి లేకుండా అన్ని కర్మలు ఆచరించాలి. జ్ఞానాగ్నిలో వాసనలను దగ్ధం చేసుకున్న వాడే పండితుడు.

ఈ శ్లోకం యొక్క అర్థం వివరిస్తూ శ్రీగురుదేవులు నవరాత్రి ఉత్సవాలలో "వాసనలు రహితం చేసుకోవాలంటే సద్గురు కృప ఉండాలి. 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి' బ్రాకెట్‌లో 'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి' అంటున్నాడు మీ హృదయ బాబు" అనేవారు.

**యదృచ్ఛా లాభసంతుష్టః ద్వంద్వాతీతో విమత్సరః ।**
**సమసిద్ధావ సిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥ 22**

ఎప్పటికి ఏది లభిస్తుందో దానితో తృప్తి చెందుతూ, ఈర్ష్య అసూయలను వీడి సుఖ దుఃఖాలు, జయాపజయాల పట్ల సమదృష్టి కలవాడు కర్మబంధాలలో చిక్కుకొనడు.

యజ్ఞం చేసేవాడు హోమద్రవ్యాలు, హోమాగ్ని, హోమకర్మ అన్నీ పరబ్రహ్మ స్వరూపాలే అని గుర్తించాలి. యజ్ఞకర్మలు చేసేవాడు ఆ పరబ్రహ్మనే పొందుతాడు.

దాన ధర్మాలు యజ్ఞంకాక మరేమవుతాయి? తపస్సే యజ్ఞంగా కొందరు, యోగసాధనే యజ్ఞంగా మరికొందరు ఆచరిస్తున్నారు. మరి కొందరు వేదాధ్యయనమే యజ్ఞమని, ఇంకొందరు అపానంలో ప్రాణము, ప్రాణంలో అపానము హోమం చేస్తున్నారు. ఈ యజ్ఞాలన్నిటికంటె జ్ఞాన యజ్ఞం శ్రేష్ఠం. అన్ని కర్మలూ జ్ఞానంలోనే పరిసమాప్తం అవటమే దానికి కారణం. ఇట్టి జ్ఞానాన్ని పొందాలంటే .........

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః ॥ 34**

తత్త్వవేత్తలయిన జ్ఞానులను వినయ విధేయతలతో ఆశ్రయిస్తే, వారు నీకు జ్ఞానోపదేశం చేస్తారు. అట్టి జ్ఞానం పొందిననాడు మోహం లేనివాడై సమస్త ప్రాణులను నాలో నీలో కూడా చూడగలడు.

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

ఆ క్షణానే మాలతి భర్త వచ్చాడు. కన్నయ్య మాయమైపోయాడు. వస్తూనే "మాలతీ! 'చపలా' అంటున్నావేమిటి? మా చపలను నువ్వు కలవరిస్తున్నావేమిటి?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు భర్త. రోజూ రాత్రి పూట తను కలవరించే మాట అది.



తెల్లవారాక మామగారు బయటకు వెళ్ళబోతుంటే ఆయనతో ఏదో చెప్పాలన్నట్లుగా మాలతి ఆయన ఎదురుగా నిలబడింది. "ఏమ్మా! ఏమైనా చెప్పాలా?" అంటున్న మామగారితో, "అవును మావయ్యా! రోజూ మీ అబ్బాయి నిద్రలో ఏదో కలవరిస్తున్నారు" అన్నది. ఆయన ఆదుర్దాగా 'ఏమని?' అని అడిగారు. "చపలాక్షీ, జలజాక్షీ, కామాక్షీ......" అంటూ ఉంటారు. ఇంతకీ వారెవరు?" అని అడిగింది.

"వాళ్ళంతా కంసరాజుగారి కొలవులో ఆటగత్తెలు, పాటగత్తెలు. వెళ్ళి కొట్లో కూర్చుమంటే, వెళ్ళి కొలువులో కూర్చుంటాడమ్మా! చెప్తే వినడు. వాళ్ళంతా కామరూపులైన రాక్షస స్త్రీలు. ఏ క్షణాన వాడి ప్రాణానికి ముప్పు వస్తుందో అని భయపడుతున్నాను. నాకు సుఖం, శాంతి లేకుండా పోయాయి" అన్నాడు. ఓసారి ఎప్పుడో కన్నయ్య "నేను అడుగు పెట్టిన చోట సుఖశాంతులకు లోటు ఉండదు మాలతి" అన్న మాటలు గుర్తుకు వచ్చాయి మాలతికి. "అవును! జగదేక బంధువు కన్నయ్య! ఆయనను ఆశ్రయిస్తే అందరికీ రక్షణ కలుగుతుంది" అనుకున్నది మాలతి.

"అసుర మారకుడై, జగద్రక్షకుడై చరిస్తున్న పసివాడు పల్లెలో పెరుగుతున్నాడని ఆనోట ఆనోట విన్నాను. అటువంటి పుణ్యభూమిలో పుట్టిపెరిగిన నిన్ను ఏరికోరి కోడలిగా తెచ్చుకున్నాను" అన్నారు మావగారు.

వ్రేపల్లెలో గోసంపద, భూసంపద పుష్కలంగా ఉన్న శాంతయ్య, సుందరమ్మల ఏకైక సంతానం మాలతి. అల్లారుముద్దుగా అర చేతిలో పెట్టుకు పెంచారు మాలతిని. ఒక పుట్టినరోజునాడు తల్లి అన్ని నగలు అలంకారం చేసి, 'ఇంకా ఏం కావాలమ్మా?' అని అడిగింది. మాలతి

మాత్రం 'నాకు ఇంకేమి వద్దు. నంద మామయ్య ఇంట్లో ఉయ్యాలలో ఉన్న బుల్లి బాబు మాత్రమే కావాలి' అని పంతం పట్టి కూర్చుంది. "వాడిని ఎప్పుడు చూశావే?" అన్నది తల్లి ఆశ్చర్యంగా. "ఉయ్యాల పేరంటం రోజున వెళ్లాం కదా. అప్పుడు వాడేమో నావైపు చూసి నవ్వాడు. నా చెయ్యి కూడా గట్టిగా పట్టుకున్నాడు. అప్పటి నుంచి నాకు వాడే కావాలని అనిపిస్తోందమ్మా" అన్నది. ఈ మాటలు తల్లి వెళ్ళి యశోదకు చెప్పింది. "పోనీలేవే ఆడించుకోమనవే పిల్లాణ్ణి" అన్నది యశోద. ఆరోజు నుంచి మాలతి ఆటపాటలు సాగించింది కన్నయ్యతో.

మాలతి పెద్దదయింది. పెళ్ళీడు వచ్చిందని నలుగురూ అంటుంటే మంచి సంబంధం కుదిరితే చేస్తాను అని తండ్రి అందరితో అంటున్నాడు. మధురా నగరంలో సరుకుల వ్యాపారం చేసే భూషయ్య కొడుకు మదనుడుకి మాలతిని చేసుకుంటామని కబురుపంపారు. ఆమె అందమైన పిల్ల. ఆస్తి కలది. అలాగే అని శాంతయ్య మాలతిని మదనుడికి ఇచ్చి వివాహం జరిపించాడు.

వ్రేపల్లెలో ఉంటే మదనుడికి ప్రాణరక్షణ జరుగుతుందని, పరిసరాలు మారితే బుద్ధికూడా మారుతుందనే నమ్మకంతో భూషయ్య మాలతితో "ఇప్పుడే మీ నాన్నకు కబురు పంపుతాను. మీ ఇద్దరినీ వ్రేపల్లెకు పంపుతాను. వ్రేపల్లెవాసి అయ్యాక నీ సాంగత్యంతో వాడి నడవడిక కూడా బాగుంటుందనే నమ్మకంతో ఆలోచించాను. అక్కడ మీ నాన్నకు కూడా వీడు చేదోడువాదోడుగా ఉంటాడు" అని అంటున్న మామగారి మాటలు విని మాలతి నెత్తిన పాలు పోసినట్లుగా అయింది.

దయానిధి అయిన కన్నయ్య తనకిచ్చిన వరం ఇప్పుడు నెరవేర బోతున్నందుకు మనస్సులోనే కన్నయ్యకు నమస్కరించింది. దిక్కులతో ప్రతిధ్వనిస్తూ, వేణుగాన ధ్వనులతో కూడిన కన్నయ్య కాలి అందెల మ్రోత ఇక ఎప్పుడూ వినవచ్చు కదా! అని బ్రహ్మానంద భరితురాలైంది మాలతి.

ఆపైన కథంతా నల్లనయ్యదే! అన్నీ వాడి లీలలే! తలచుకున్న వారికి సుఖశాంతులు, ఆనందం, పరమానందం లభ్యమవుతాయి కదా!!

# పరిరక్షణ

- రమణ ప్రసాద్

మార్చి 15న గురుదశమి నాడు శ్రీ సద్గురు పాదపూజ ముగిసిన తరువాత శ్రీ మాతాజీ విజ్ఞానమందిరంలోకి వెళ్తూ, శ్రీనారాయణ ప్రసాద్ గారితో, "నేను రేపు  హైదరాబాద్ వెళ్తున్నాను. అక్కడ క్రొత్తగా కట్టిన ఆశ్రమంలో పనులు చూసుకుని, 17 తెల్లవారుజామున శ్రీరామకృష్ణ నూతన గృహ ప్రవేశం అయన తరవాత తిరిగి ఆశ్రమానికి వస్తాను" అన్నారు. "ఎప్పుడో 17న గృహ ప్రవేశం అయితే తమరు ఒకరోజు రెస్ట్ తీసుకుని 17న బయల్దేరవచ్చు కదమ్మా" అని వారు అంటే, అమ్మ నా వైపు చూసి, "వీళ్ళందరినీ నేనే తీసుకువెళ్ళి తిరిగి తీసుకు వస్తాను" అన్నారు.

16 వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు మూడు కార్లలో శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్‌గారు, అరుంధతి, తదితర కుటుంబ సభ్యులమైన మేమందరము బయల్దేరాము. మేము ప్రయాణం చేస్తున్న కారును శ్రీకుమారస్వామి రాజా నడుపుతున్నాడు. అందులో నేను, నా భార్య, శ్రీరామ సుబ్రహ్మణ్యంగారు వారి భార్య సుశీల ఉన్నారు. మేము ప్రయాణం చేస్తున్నది  ఎన్నో ఆధునిక వసతులున్న 'వోల్వో'కారు. ఆ కారులో ఆటోమేటిక్ ఎట్మాస్ఫియర్ కంట్రోల్, ఆటోమేటిక్ గేర్ సిస్టమ్ ఇంకా ఎన్నో సేఫ్టీ సిస్టమ్స్ ఉన్నాయి.

మా ప్రయాణం బాగా సాగుతోంది. కారు నర్కేట్‌పల్లి దాటి టోల్‌గేట్‌ను సమీపిస్తుండగా, సడెన్‌గా ఒక పెద్ద లగ్జరీ బస్సు అతి వేగంగా మా కారును డ్యాష్ చేసింది. రాజా సమయస్ఫూర్తితో ప్రక్కకి తప్పించటంతో, ఆ బస్సు మా కారును దూసుకుంటూ వెళ్ళిపోయింది. అంతే! మా కారు నిండా పొగలు. అందరం "బాబూ! బాబూ! అని అరిచాము. సేఫ్టీ బెలూన్స్ తెరుచుకోవటంతో మాకు రక్షణ జరిగింది. కారు నడుపుతున్న రాజా ఎల్లా ఉన్నాడా? అని మేము కంగారు పడ్డాము. బాబు దయ వల్ల అతను సురక్షితంగా ఉండటమేకాక కారు తలుపులు తానే తెరిచి," మనకి ఏం కాలేదు! బాబు దయ వల్ల అందరం క్షేమంగా బ్రతికి బయట పడ్డాము" అన్నాడు. మా కారు రోడ్డు డివైడర్ పైన ఎక్కి

ఆగటంతో, సేఫ్టీ బెలూన్స్ తెరుచుకోవటంతో మాకు రక్షణ జరిగింది.. అక్కడి వారందరూ వచ్చి రాజాతో, "మీరు చెప్పండి! మేము వెళ్ళి ఆ బస్సును ఆపుతాము" అన్నారు. రాజా మేమందరం క్షేమంగా ఉండటం చూసి, "బాబూజీ దయ వల్ల మేమందరం క్షేమంగా ఉన్నాం. అది మాకు చాలు."అన్నాడు అక్కడివారితో.

మా కారు యాక్సిడెంట్ అయిన మరుక్షణంలో శ్రీమాతాజీ మా ఎదుట నిలిచి ఉన్నారు. ఎవరెవరికో ఫోన్లు చేసి "బాబు దయ వల్ల పెద్ద గండం తప్పింది. అందరూ క్షేమంగా ఉన్నారు" అని అంటూ ఉండటం విన్నాం. మా అందరికీ ధైర్యం చెప్పి ఆ కారులోనించి సామాన్లు అన్నీ బయటకు తీయించారు. పోలీసులకు రిపోర్టు చేసి క్షతిగ్రస్తమైన కారును హైదరాబాద్ చేర్చటానికి రాజాకి మద్దత్తుగా తాము అక్కడే ఉండి తరువాత వస్తాననీ మమల్ని టాక్సీలో హైదరాబాద్ చేరుస్తామనీ అన్నారు. ఇంతలో ఒక ఎక్స్ప్రెస్ బస్సు వచ్చి ఆగింది. "బాబూ అందులో ఖాళీలు ఉన్నాయా?" అని అడిగాము. "ఇరవై సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ బస్సు నేరుగా బస్ స్టాండ్‌లో ఆగుతుంది"అన్నాడు ఆ బస్సు డ్రైవరు.

శ్రీమాతాజీ మమల్ని బస్సులో ఎక్కించి, "మీరు వెళ్ళండి.నేను ఆశ్రమానికి ఫోన్ చేసి చెప్పాను. వాళ్ళు వచ్చి మిమ్మల్ని హైదరాబాద్ బస్‌స్టాండ్‌లో రిసీవ్ చేసుకుంటారు. మీ వెనకే నేను వస్తున్నాను" అన్నారు. మేము క్షేమంగా హైదరాబాద్ ఆశ్రమానికి చేరాము. ఆ సాయంత్రం అక్కడ శ్రీ సద్గురు పాదపూజ జరిగింది. అప్పటికి రాజా కూడా చేరుకొన్నాడు. అందరం క్షేమంగా ఉండటం చూసి శ్రీమాతాజీ మురిసిపోయారు. మేము ఆమెకి ఎలా, ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పాలో తెలియక తికమక పడ్డాము.

శ్రీ మాతాజీ,"ఏమీ లేదు. మీకు ఏ ఆపదా రాకుండా రక్షించుకున్నారు బాబూజీ" అన్నారు.

నిజానికి అది శ్రీమాతాజీ మా వెన్నంటి ఉండి కాపాడిన సంఘటన. అది వారు చేసిన పరిరక్షణ.

# అమృతబిన్దూపనిషత్

సేకరణ - పరాశర ప్రసాద్

(శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారి బోధ సంక్షిప్తంగా)

అమృత బిన్దూపనిషత్ చిన్నది, ఇరువది నాలుగు మంత్రాలతో కూడినది. నిజంగా ఇది అమృతమే. ఎందుకంటే మృతము లేనిది. మృతము లేకపోవటం అంటే ముక్తే. అదే జ్ఞానము. స్వస్వరూప జ్ఞానము. ముక్తి కావాలంటే సాధన చేయాలి. సాధన ఎవరికి? శరీరం జడం. ఆత్మకి మోక్షం అక్కర్లేదు. అంటే శరీరానికి ఆత్మకి మధ్యన ఉండే మనస్సుకి సాధన కావాలి. మనస్సులో అమ్మను పెట్టుకోండి. మనస్స పవిత్రమవుతుంది. మనస్సు రెండు రకాలు. పవిత్రము, అపవిత్రము. కామసంకల్పమే అశుద్ధమనస్సుకి కారణము. కామవర్జితమైతే మనస్సు శుద్ధమే. మనస్సు అంటే ఏమిటి? మనస్సు మనందరిలో ఉంది. ఏదైనా సంకల్ప వికల్పాలు చేసినప్పుడు అది మనస్సుగా, చింతన చేస్తే చిత్తముగా, నిర్ణయించేటప్పుడు బుద్ధిగా, క్రియ చేసేటప్పుడు అహంకారముగా వ్యవహరిస్తోంది.

ప్రతి మానవుడు లౌకికంగాను, ఆధ్యాత్మికంగాను మనస్సును ఈ నాలుగు విధాలుగా వాడుకుంటున్నాడు. చూడండి. ఇక్కడ ఈ ప్రతిష్ఠా మహోత్సవము నిర్ణయింప బడినది. మీరు మీ ఊళ్ళో ఉన్నారనుకోండి అప్పుడు మనస్సు సంకల్పిస్తుంది. 'అయ్యో! అక్కడ ప్రతిష్ఠా మహోత్సవానికి వెళ్ళాలి' అంటుంది. ఇంతలోనే మనస్సులోనే వికల్పం బయలుదేరుతుంది. 'వెళ్ళవచ్చులే. ఈరోజే ఎందుకు? రేపు వెళ్దాం' అంటుంది. ఇంతలోనే చిత్తము చింతన చేస్తుంది. 'రేపు వెడితే కొంతమంది మహాత్ములు వెళ్ళి పోతారేమో' అంటుంది. వెంటనే అహంకారం లేచి 'ఆఁ! ఏముంది మహాత్ములు చెప్పేది అంతా శాస్త్రాలలోదే కదా!' అంటుంది. కాని బుద్ధి 'మహాత్ములు ఎన్నో శాస్త్రాలు చదివి, అనుభవాన్ని సంపాదించి చెబుతారు. దానిని మనం వినవలసినదే. కాబట్టి వెళ్ళాలి' అని నిర్ణయిస్తుంది.

ఇదేవిధంగా ప్రాపంచికంగా కూడా మనస్సు మానవులపై తన ప్రభావాన్ని ఎలా చూపుతుందో పరిశీలించండి. కూరగాయలు తేవడానికి మార్కెట్టుకు వెళ్ళారు. బీరకాయలు, వంకాయలు, బంగాళ దుంపలు ఇంకే ఏవేవో కూరలన్నీ తెచ్చేశారు. ఇంటికి రాగానే మనస్సు సంకల్పం చేస్తుంది 'బీరకాయ కూర చేద్దామ'ని. వద్దులే ఇవాళ బంగాళ దుంప చేసుకుంటే బాగుంటుందనే వికల్పం వస్తుంది. చిత్తము చింతన చేసి,

'బంగాళ దుంపలు ఎన్ని రోజులైనా నిలువ ఉంటాయి కదా అవి ఇవాళ ఎందుకు' అంటుంది. బుద్ధి 'వంకాయలు వాడుకోకపోతే పాడై పోతాయి కాబట్టి వంకాయ కూర చేద్దామ'ని నిర్ణయిస్తుంది. అహంకారం బుద్ధి నిర్ణయించిన ప్రకారం క్రియ చేసేస్తుంది.

ఈ నాలుగు ఏమిటో మనకి తెలియదు కాని, మనస్సు అనేది అంతఃకరణ సంకల్ప వికల్పాల సంపుటి అని తెలుస్తోంది. అంతఃకరణ యదార్థంగా మంచిదే. మరి మాలిన్య మనస్సుకి కారణము ఏమిటి? జీవుని యొక్క నిషిద్ధ కర్మాచరణ ద్వారా మనస్సు మాలిన్యమవుతోంది. అయితే జీవుని పుణ్య విశేషం చేత సద్గురుమూర్తి సమాశ్రయం కలిగి, మాలిన్యము రహితమై మలిన మనస్సు శుద్ధ మనస్సుగా మారుతుంది. సంకల్ప రహితమైన మనస్సే శుద్ధ మనస్సుగా పిలువబడుతుంది.

శాస్త్రీయమైనవన్నీ తెలుసుకోవలసినదే. కాని ఏది ఎంతవరకు అవసరమో దానిని అంతవరకే తెలుసుకోవాలి. అంతేకాని సాధకుడు ఏ వ్యామోహంలో పడకూడదని హెచ్చరించటానికి స్వామివారు తమ గురుదేవులు చెప్పిన కథని ఉదహరించారు.

ఇద్దరు వ్యక్తులు కలిసి అలా ప్రయాణం చేస్తున్నారు. వారు వెళ్ళే దారిలో మామిడితోట కనబడింది. ఇద్దరు వ్యక్తులూ తోటలో ప్రవేశించారు. ఒక వ్యక్తి చెట్టుపైన పండును చూశాడు. చెట్టు ఎక్కాడు. పండుకోసుకుని తిన్నాడు. చెట్టుపైకి ఎక్కగానే దూరంగా తోట యజమాని గోచరించాడు. రెండవ వ్యక్తి తోటలోపలికి వెళ్ళి, చెట్లను పరిశీలుస్తున్నాడు. ఇంతలో యజమాని వీరిద్దరూ ఉన్నవైపు వస్తున్నాడు. దానిని గమనించి, చెట్టుపైకి ఎక్కిన వ్యక్తి గబగబా క్రిందికి దిగి, పారిపోతూ తన స్నేహితుని కూడా పారిపొమ్మని హెచ్చరించాడు. కాని ఆ రెండవ వ్యక్తి తోట లోపలికి వెళ్ళి, పరిశీలిస్తున్నాడు కాబట్టి యజమానికి దొరికిపోయాడు. యజమాని చెట్టుపైన తాను గుర్తించిన పండు ఈ దొరికిన వ్యక్తే కోసి ఉంటాడని ఊహించి, దేహశుద్ధి చేసి పంపించాడు. చూశారా! ఫలితం ఎవరికి దక్కినట్లు? పండు తిన్నవాడికా? చెట్లను పరిశీలించినవాడికా? అలాగే శ్రవణం చేసిన దానినిగాని, పఠనం చేసిన దానిని గాని ఎవరైతే వెంటనే అనుభవంలోకి తెచ్చుకుంటారో వారే ఫలితాన్ని అనుభవిస్తారు. అలా కాకుండా తర్కవితర్కాలతో సతమతమయ్యే వారికి తలచిక్కు బేరాలే సుమా! అన్నట్లుగా ఉంది కథ!

- సశేషం

# సద్గురు శ్రీ యాత్రాదర్శన్

(గత సంచిక తరువాయి) -డా॥ సుధ

స్థల పురాణం -

త్రేతాయుగంలో రావణ కుంభకర్ణాదుల బారి నుండి సత్పురుషులను, సాధువులను రక్షించడానికి జగన్మాత తన అంశతో దివ్యమైన బాలికను సృష్టించింది. ఆమె దక్షిణ భారతదేశంలో పుణ్యమూర్తి రత్నాకర్‌సాగర్‌కి పుత్రికగా జన్మించింది. ఆమెకు త్రికూట అని పేరు పెట్టారు. ఆమెకే వైష్ణవి అని మరో పేరు. ఆ పాప తన యొక్క మహిమలు, దివ్య శక్తులతో, సామాన్యులను, మహాత్ములను, సిద్ధపురుషులను ఎంతో మందిని ఆకర్షించింది. కొంతకాలం తరువాత ఆమె తన తండ్రి అనుమతి తీసుకుని సముద్ర తీరంలో విష్ణుమూర్తిని, శ్రీరామునిగా ధ్యానించి తపం ఆచరించింది.

శ్రీరాముడు సీతాన్వేషణలో అక్కడకు వచ్చి నీ తపస్సుకు కారణం ఏమిటని ప్రశ్నించాడు. ఆమె శ్రీరామచంద్రుని తన భర్తగా కోరుకుని తపస్సు చేస్తున్నానని చెప్పింది. అప్పుడు శ్రీరాముడు తాను ఏకపత్నీ వ్రతుడనని, అయినా నేను మరో రూపంలో తనకు కనిపించినప్పుడు తను గుర్తిస్తే తప్పక భార్యగా స్వీకరిస్తానని చెబుతాడు.

లంక నుండి తిరిగి వచ్చాక, ఒక సాధువు రూపంలో త్రికూట వద్దకు వెళ్తాడు. ఆమె గుర్తించలేక పోతుంది. అప్పుడు శ్రీరామ చంద్రమూర్తి ఆమెను కలియుగం నందు కల్కిగా అవతరించి నప్పుడు వివాహమాడతానని వరమిస్తాడు. అంతవరకు ఆమెను త్రికూటపర్వత గుహలో తపస్సు చేయవలసిందిగా ఆదేశిస్తాడు. "నీవు చిరంజీవిగా నిలుస్తావు. వైష్ణవిగా ప్రసిద్ధి చెందుతావు. విశ్వమంతా నిన్ను కొనియాడుతుంది" అని ఆశీర్వదిస్తాడు. "కోతులు సైతం నిన్ను రక్షిస్తూ ఉంటాయి" అని కూడా వరమిస్తాడు. ఈ విధంగా ఈ వైష్ణవీదేవి త్రేతా యుగం నుండి త్రికూట పర్వతం మీద భోగమోక్ష ప్రదాయినిగా ఉంది.

- సశేషం

# హనుమజ్జయంతి - రమణ ప్రసాద్

అనన్యమైన భక్తికి, అనంత శక్తికి, అతులిత పరాక్రమానికి ప్రతీకగా హనుమంతుని ప్రజలు ఎంతో భక్తితో కొలుస్తారు. హనుమజ్జయంతినాడు ఉదయాననే హనుమదాలయాలకు వెళ్ళి, సిందూరం హనుమంతునికి సమర్పిస్తారు. శాంతి, సౌభాగ్యాల కోసం, భూత ప్రేత పిశాచాల బారినుండి రక్షణకోసం శ్రీ తులసీదాసు విరచితమైన "హనుమాన్ చాలీసా" పారాయణ చేస్తారు.



హనుమంతుని అకుంఠిత భక్తిని చాటే కొన్ని గాధల గురించి తెలుసుకుందాం: రావణ వధానంతరం శ్రీసీతా రాములు అయోధ్యా ప్రవేశం చేశారు. శ్రీరామ పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరాముడు విలువైన కానుకలు ఇచ్చి అందరినీ సత్కరిస్తున్నాడు. కాని హనుమకు ఏమీ ఇవ్వలేదు. ఇది గమనించిన సీత హనుమకు ఎంతో విలువైన రత్నాల హారం కానుకగా ఇచ్చింది. హనుమంతుడు దానిని బాగా పరిశీలించి, పెదవి విరిచి, ఒక్కొక్క రత్నాన్ని పంటితో కొరికి విసిరేస్తున్నాడు. ఇది చూసి సీత "ఏమిటిది హనుమా! ఎంతో విలువైన హారాన్ని నీకు ఇస్తే, హారంలోని రత్నాలను పగులకొడుతున్నావు?" అని అడిగింది. "మాతా! ఈ రత్నాలలో నా రాముడు కనిపిస్తాడేమోనని చూశాను. కాని కనిపించలేదు" అన్నాడు. ఈ సమాధానం విన్న సభలోనివారందరూ పకపకా నవ్వి,"అయితే రాముడిని నువ్వు మాకు చూపగలవా?" అని అడిగారు. "రాముడు అంతటా నిండి ఉన్నాడు. నాలోనూ ఉన్నాడు" అని తన గుండెను చీల్చి చూపించాడు. అందులో శ్రీసీతారాములు విరాజమానమై ఉన్నారు.

ఒకనాడు సీతామాత తన పాపిటలో సిందూరం దిద్దుకోవటం హనుమంతుడు చూశాడు."మాతా! మీరు మీ నుదటను ధరించినది ఏమిటి?" అని అడిగాడు. "నేను నా స్వామి దీర్ఘాయుష్షు కోసం ఈ సిందూరాన్ని ధరిస్తున్నాను" అని సీత బదులిచ్చింది. అంతే! మరుక్షణంలో హనుమంతుడు ఒంటినిండా సిందూరం పూసుకుని సీతారాముల ముందు నిలబడ్డాడు. రాముడు ఆశ్చర్యంతో " హనుమా! ఈ రోజు మాకు ఈ లీల ఎందుకు చూపిస్తున్నావు?" అని అడిగాడు. "స్వామీ!

మీ దీర్ఘాయుష్షు కొరకు సీతామాత చెప్పిన విధంగా నేను సిందూరాన్ని ధరించాను" అని అన్నాడు. రాముడు అతని భక్తికి సంతోషించి, "హనుమా! ఈ సిందూరం నీకు భక్తితో సమర్పించేవారి కష్టాలన్నీ తొలుగుతాయి" అని వరం ఇచ్చాడు.

అయోధ్యకు వచ్చాక అనవరతం రాముని సేవించే అవకాశం లభించటంలేదు. సీత "ఏకాంత మందిరంలోకి అనుమతి లేకుండా నువ్వు లోపలకి రాకూడదు" అని అన్నది. గోరు చుట్టు మీద రోకటి పోటులాగా, రాముని అన్నదమ్ములు. సీతామాత రామునికి చేయవలసిన సేవలన్నీ పంచుకుంటున్నట్లు రాముని ఆమోదంతో ఉత్తరువులు జారీ చేశారు. హనుమ "నాకు మీరు ఏ సేవను ఇచ్చారు?" అని అడిగాడు. "నువ్వు అరణ్యంలో 14 ఏళ్ళు చాలా సేవలు చేశావు. ఇప్పుడు ఆ సేవలన్నీ మేము చేస్తాము. నువ్వు విశ్రాంతి తీసుకో" అని చెప్పారు.

హనుమంతుడు ఆ సేవల లిస్ట్ చూశాడు. రాముడు ఆవలిస్తే చిటిక వేసే సేవ ఎవ్వరికీ ఇవ్వబడలేదు." నాకు ఈ సేవ ఇవ్వండి" అన్నాడు. వారు "సరే"అన్నారు. ఒకసారి రాముడు ఏకాంత మందిరంలో ఉన్నాడు. హనుమకు లోపలకు ప్రవేశం లేదుగా. అందుకు తాను బయట కూర్చుని "నా రాముడికి ఆవలింత వస్తే బయటనుంచి చిటిక వెయ్యలేను కదా ఈలోపు నా రామునికి ఆవలింత వస్తే ఎలా?" అని ఆపకుండా చిటిక వేస్తున్నాడు. ఆవలించిన రాముని తెరిచిన నోరు తెరిచినట్లే ఉండిపోయింది. రామునికి ఏమైనదో తెలియక అందరూ కంగారు పడ్డారు. వైద్యులు పెదవి విరిచారు. అప్పుడు వసిష్టులవారు బయటకు వచ్చి ఆపకుండా చిటిక వేస్తున్న హనుమంతుని ఆపారు. రాముని ఆవలింతలు ఆగిపోయాయి. వెంటనే హనుమంతుడు రామునికి అన్ని సేవలూ చేయటానికి అనుమతి ఇస్తున్నట్లు ఉత్తరువులు జారీ చేయబడ్డాయి. ఇవి హనుమంతుని అనన్యభక్తికి తార్కాణాలు.

హనుమంతుడు అంజనా దేవికి వాయుపుత్రుని అనుగ్రహంతో జన్మించాడు. సాక్షాత్తు శివుడే రామావతారంలో విష్ణుమూర్తి అవతారమైన రామునికి సేవలు చేయటానికి హనుమంతుడిగా పుట్టాడని చెబుతారు. వైశాఖ బహుళ దశమినాడు హనుమంతుడి పుట్టినరోజు. ఆనాడు ప్రజలందరూ ఆంజనేయ స్వామిని ఊరేగిస్తారు. హనుమంతుడిని భక్తితో కొలిచి సుఖశాంతులను పొందుతారు.

**శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూలు**

**(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపు పొందిన సంస్థ)**

**అతి తక్కువ ఫీజులతో, ఉత్తమ విద్యాబోధనతో నడుపబడుతున్న 'ఏకైక విద్యా సంస్థ'**

అడ్మిషన్లు జరుగుచున్నవి

త్వరపడండి!

కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవముతో కూడిన అధ్యాపకుల ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్.కె.జి తో సహా టెన్త్‌క్లాసు వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

**ప్రత్యేకతలు**

2012-13 నుండి శ్రీచంద్రకాళీవిద్యానిధి 1మరియు 2 ప్రారంభం

350మంది అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

* ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
* క్రమశిక్షణ, సత్ ప్రవర్తన
* రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటము
* వీక్లీటెస్ట్‌లు, డైలీ అసైన్‌మెంట్లు
* డేస్కాలర్స్‌కి బస్సు సౌకర్యము
* బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి
* నర్సరీ నుండి 1వ తరగతి వరకు ఉచిత మధ్యాహ్న భోజనము అమలు.

సంస్కృతం మరియు హిందీ పరీక్షలకు శిక్షణ

స్కాలర్‌షిప్‌లను పొందిన విద్యార్థులకుస్కాలర్‌షిప్‌ను డిగ్రీవరకు కొనసాగించుట 'శ్రీ చంద్రకాళీ విద్యానిధి' ప్రత్యేకత

మంచి విలువలతో కూడిన తెలుగు, ఇంగ్లీషు, హిందీ గ్రంథాలయము

కంప్యూటర్ ఎడ్యుకేషన్ మరియు సైన్స్ ల్యాబ్ సౌకర్యం కలదు.

గమనిక - స్కూలు ది. 2-6-2015న తెరువబడును.

వివరములకు

కరస్పాండెంట్ గారిని స్వయంగా గాని,

ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

డా॥కె.వి. ఆర్. రమణ M.Sc., Ph.D.

కరస్పాండెంట్

ఫోన్ : 0863 - 2594211(స్కూలు); 0863 - 2293824 (ఇల్లు)

మొబైల్ - 93932 20400

# ధృవతార

- రమణ ప్రసాద్

శ్రీ ఇందుకూరి సత్యనారాయణరాజు గారు శ్రీబాబూజీ మహరాజ్‌వారి అంతరంగిక భక్తులు. నిండ్రకొలను డాక్టరు (వెంకట్రాజు)గారి ద్వారా శ్రీబాబు సన్నిధికి వచ్చారు. 1972లో ఆశ్రమస్థాపన జరిగినప్పడి నుండి సత్తిరాజుగారు ఆశ్రమ నివాసం చేస్తూ ఆశ్రమానికి ఎనలేని సేవలను అందించారు. శ్రీ సత్తిరాజుగారు 31-3-15 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 92సంవత్సరాలు. ఈ సందర్భంగా శ్రీమాతాజీ వారి గురించి మాట్లాడుతూ "శ్రీ సత్తిరాజుగారు ఎప్పుడూ భక్తి తన్మయత్వంతో అలౌకిక స్థితిలో ఉండేవారు. ఎప్పుడూ శ్రీబాబు స్మరణే. శ్రీబాబు 'గాఢమైన భక్తే జ్ఞానం' అనేవారు. దానికి



తార్కాణం శ్రీ సత్తిరాజుగారే. ముంజవరపు కొట్టులో శ్రీబాబూజీవారికి శివరాత్రికి సహస్ర ఘటాభిషేకం జరుగుతూ ఉంటే పెద్దగంగాళంతో నీరుతెచ్చి స్వయంగా సత్తిరాజుగారు అభిషేకించేవారు. ఆయన చాల సన్నగా ఉండేవారు. వారికి ఇంత శక్తి ఎక్కడి నుంచి వచ్చిందా? అని ఆశ్చర్యపడేదానిని. శ్రీసత్తిరాజుగారికి భోజనం పెట్టి వారి అమ్మాయి కుమారి వంటింట్లోకి వెళ్ళింది. తిరిగి వచ్చి చూసేసరికి రాజుగారు బాబూజీ చిత్రపటానికి 'తినండి బాబూ! కొంచెం తినండి బాబూ!!......' అంటూ తినిపించటం చూసి ఆశ్చర్య పోయింది. ఎప్పుడో నామదేవుడు పాండురంగనికి నివేదన చేసి తినమని బ్రతిమిలాడినట్లు విన్నాము. ఇక్కడ ప్రత్యక్షంగా చూశాము. శ్రీబాబూజీ మహరాజ్‌వారు మనకందరికి చూపించారు. భక్తి ఎంత గొప్పదో ప్రత్యక్షంగా తెలియజేశారు. శ్రీబాబూజీ భక్తులుగా ధృవతారగా ఎప్పుడూ వారు వెలుగుతూనే ఉంటారు! వారు చేసిన సాధన మనకందరికీ అనుసరణీయం! ఆచరణీయం!!" అన్నారు శ్రీమాతాజీ.

శ్రీసత్తిరాజుగారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాము.

# ఇంద్రద్యుమ్నుడు - కామేశ్వరీ ప్రసాద

మొసలి గజేంద్రుణ్ణి లోపలికి ఈడ్చుకుపోతోంది. ఈ పోరాటం ఎలా గెలవాలి? గజేంద్రుడి బలం తగ్గిపోతోంది. 'అసలు నాకున్న బలం ఈ మొసలికి ఎక్కడుంది?' అనుకుని తిరిగి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశాడు.

ఎవరికైనా బలం ఉన్నంతవరకూ తానేగొప్ప అని అనుకుంటూ ఉంటాడు. తన శక్తి బాగా తగ్గాక పరమాత్మ జ్ఞాపకం వస్తాడు. అదే విధంగా గజేంద్రుడు పూర్వజన్మలో నారాయణ భక్తుడు కనుక సంస్కార బలంతో వెంటనే నారాయణుని యందు మనస్సు నిల్పి వేడుకున్నాడు. అంత సులభంగా దర్శనమిస్తాడా ఆ భగవానుడు? ఆయన శల్య పర్యక్షలు పెడతాడు. ఎందుకంటే ఇంకా ఎక్కడైనా నేను, నాది అనే అహంకార మమకారాలు ఉన్నాయేమో అవి అడ్డువచ్చి మరల జన్మకు కారణం అవుతుందేమో అని. భగవంతుని లీలలు తెలియ ఎవరి తరము?

'ఈ మొసలిని ఎలా గెలవాలి? నాకు అడ్డువచ్చి ఆదుకునేవారే లేరా? నా కష్టం చూసి ఏ వేల్పుకి కూడా జాలి కలగటం లేదా? నన్ను రక్షించే వారే లేరా? నా మొరలు ఆలకించేవారే లేరా?' అంటూ పరిపరి విధాల వేడుకున్నా కూడా ఏమి ప్రయోజనం కలుగలేదు.

'అయ్యో! పరమాత్మా! నిరంతరం సాధువులను రక్షిస్తావని విన్నానే! నేను కూడా నీ సృష్టిలోని వాడినే కదా! నీ బిడ్డనే కదా! నా మీద నీ దయ రవ్వంతైనా రాదా ప్రభూ! ప్రహ్లాదుడు, ధృవుడు వారందరినీ రక్షించావు కదా! మరి నాకు వారికి మల్లే స్తోత్ర పాఠాలు రావు కదా! పోనీ సాలెపురుగు, పాము మొదలైన జీవాలకు కూడా మోక్షమిచ్చావు కదా! మరి నేను ఒక్కడినే నీకు బరువైపోయానా ప్రభూ! కాపాడవా! నా మొర వినవా! రావా! రావా!.........' అంటూ పరిపరి విధాల ప్రార్థించాడు.

- సశేషం

# సత్సంగామృతం

- మురళీ

(శ్రీ దసరా మహోత్సవాలలో 26-9-2014 అనగా రెండవ రోజున శ్రీమాతాజీ అందించిన బోధామృతం సంక్షిప్తముగా)

శ్రీ సద్గురుదేవులు ఎన్నో సంవత్సరాలుగా శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించి, తమ దివ్యబోధలను అనుగ్రహించి, మనచే ఆచరింపజేయటం వారి అనిర్వచనీయమైన కృపకు తార్కాణం! జగన్మాత స్వరూపంలో ఉన్నటువంటి శ్రీగురుదేవుల అనుగ్రహ వీక్షణం అపారమైన సరిహద్దులేని ప్రేమ కలది. ఆ అనుగ్రహ వీక్షణం మనలను పునీతులను చేస్తుంది.



కాలం పవిత్రమైనది. ఎవరు కాలాన్ని వెచ్చించి, గురుదేవుల అనుగ్రహానికి పాత్రులవుతారో, ఆ కాలం పవిత్రమైనది. అమూల్యమైనది. ఎవరైతే సాధనలో ఉంటారో, ఉన్నత స్థితని పొందుతారో వారు పూర్వ స్మృతిని, జ్ఞానాన్ని మరచిపోరు. ఎవరు మనలను దూషించారో, ఎవరెవరికి ఏమేమి జరిగాయెూ మెుదలైన విషయాదులను గుర్తు తెచ్చుకోవటం పూర్వస్మృతి అనిపించుకోదు. అవన్నీ నిన్ను మృత్యుతీరానికి తీసుకు వెళ్ళేవే.

పూర్వ స్మృతి అంటే గురుదేవుల అనుగ్రహ వీక్షణం. ప్రేమ పూర్వకమైన పలకరింపు. శ్రీబాబూజీ మహరాజ్ సభలో అందరివైపు చూస్తుంటే, అందరం మననే చూస్తున్నారని సర్దుకుని కూర్చునేవాళ్ళం. స్వామి అందరినీ హాక్ట్‌గా ఉండండి అనేవారు. వారి అనుగ్రహ వీక్షణం. మనల్ని మనం ఉద్ధరించుకోవాలి అంటే యాక్టివ్‌గా ఉండాలి. ఏ నిమిషంలోనూ మన చెంతకు మాయ రావటానికి వీలులేదు, అలా స్వామి మనలనందరినీ తీర్చిదిద్దారు. పాతిక సంవత్సరాల నుంచి శ్రీసద్గురుదేవులు మనందరినీ ఇలా తీర్చిదిద్దారు.

- సశేషం

# పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

## నిత్య కార్యక్రమములు -

ఉదయం 4గం.లకు మేలుకొలుపు, సుప్రభాతం.

ఉదయం 4-30ని॥ నుండి 5-30ని॥ వరకు ప్రార్థన.

సాయంత్రం 7గం. నుండి 8గం. వరకు ప్రార్థన.

## మే 2015

3-5-15 ఆదివారం శ్రీగురుపూర్ణిమ సా॥ 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

11-5-15 సోమవారం సా॥ 4.05గం.లకు గణపతి పూజ, అనంతరం ప్రతిష్ఠామూర్తి శ్రీ భక్తాంజనేయ స్వామి, శ్రీ సీతారాముల ఉత్సవమూర్తుల గ్రామోత్సవం (ఊరేగింపు).

12-5-15 మంగళవారం నుండి 14-5-15 గురువారం వరకు శ్రీ భక్తాంజనేయ స్వామి పునఃప్రతిష్ఠా మహోత్సవం 12-5-15 ఉదయం 7.02ని॥లకు గోపూజతో కార్యక్రమం ప్రారంభం. ఉ॥10గం.ల నుండి 12గం.ల వరకు సత్సంగం. అనంతరం మహాప్రసాదం. సా॥ 6గం. నుండి 8గం.ల వరకు సత్సంగం, అనంతరం నీరాజనం, మంత్రపుష్పం, దర్బారుసేవ, తీర్థప్రసాదములు.

13-5-15 బుధవారం శ్రీగురుదశమి, హనుమజ్జయంతి - శ్రీభక్తాంజనేయస్వామి వారి పునః ప్రతిష్ఠామహోత్సవం 9-27ని॥లకు; 11గం.లకు సామూహిక పూజలు. అనంతరం మహాప్రసాద వినియోగము. సా॥ 5గం.లకు సత్సంగం; 7గం.లకు శ్రీ సద్గురుపాదపూజ.

14-5-15 గురువారం ఉ॥ 9గం.లకు ప్రతిష్ఠానంతర శ్రీ సీతారాముల లీలాకళ్యాణం. ఉదయం 10గం. నుండి 12గం. వరకు సత్సంగం, అనంతరం మహాప్రసాదం.

## జూన్ 2015

11-6-15 గురువారం శ్రీగురుదశమి. సా॥ 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ

వివరములకు - 94912 22652; 90106 44758; 94403 77399

# వైశాఖ పూర్ణిమ విశిష్టత

- సుషమ్నా ప్రసాద

గురుపూర్ణిమ లేక బుద్ధ పూర్ణిమగా వినుతికెక్కిన వైశాఖ పూర్ణిమ గురు పుత్రులకెంతో పవిత్రమైన పర్వదినము. సంపూర్తిగా గురు నామస్మరణ, గురుసేవకు అంకితం చేయవలసిన రోజు అని గురుదేవులు అనేకసార్లు సెలవిచ్చారు.

'ఆ', 'కా', 'మా', 'వై' అని ఆషాఢ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, మాఘ పూర్ణిమ, వైశాఖ పూర్ణిమ అనే నాలుగు పూర్ణిమలను గురుపూర్ణిమలుగా పరిగణిస్తారు. వరుస క్రమంలో వైశాఖ పూర్ణిమ ముందు వచ్చినా, ఆ, కా, మా, వై అన్న క్రమములో చివరకు వస్తుంది. ఆషాఢ పూర్ణిమ ఆశను జయించటానికి ప్రతీక అయితే, కార్తీక పూర్ణిమ కామాన్ని జయించటానికి సంకేతము. మాఘ పూర్ణిమ మాయను జయించటానికి గుర్తు. ఎప్పుడైతే సాధకుడు ఈ మూడిటిని జయిస్తాడో, అప్పుడు వైరాగ్యము దానంతట అదే వస్తుంది. అదే వైశాఖ పూర్ణిమ సంకేతం వైరాగ్యము!

వసంత ఋతువులోని చైత్ర మాసమును మధు మాసమని, వైశాఖ మాసమును మాధవమాసమని పరిగణిస్తాము. వైశాఖమాసము మాధవునికి ప్రీతికరమైన మాసము. వైకుంఠ ప్రాప్తిని కలిగించే మాసము. వైరాగ్యమనే కవచమును ప్రసాదించే విశిష్ఠతను సంతరించుకొన్న మాసము.

ఇక వైశాఖ పూర్ణిమ బుద్ధ పూర్ణిమగా ప్రసిద్ధి చెందినది. ఆ పవిత్ర దివసమే బుద్ధ జయంతి. బుద్ధ భగవానుడు బోధి వృక్షం క్రింద జ్ఞానంతో ప్రకాశించిన రోజు కూడా అదే. వైరాగ్యం పెంపొందించుకోవాలి అంటే త్యాగశీలి అయి ఉండాలి.

వేసవి తాపాన్ని తట్టుకోవటానికి వైశాఖమాసంలో ఛత్రము (గొడుగు), పాదరక్షలు, చల్లని నీరు, కుండ, చామరం (విసినకర్ర) ప్రధానంగా దానం చేయవలసిన వస్తువులు. వైశాఖమాసం ధ్యానానికి ప్రసిద్ధి. వైశాఖమాసంలో ఉష్ణోగ్రత ఎంత తీవ్రతగా ఉంటుందో, వైరాగ్యం

కూడా అంత తీవ్రంగా ఉండాలి. ఆరంభశూరత్వం అన్నట్లు కేవలం ఆరంభ వైరాగ్యంతో ప్రయోజనం లేదు. తీవ్రమైన వైరాగ్యంతో లక్ష్యార్థాన్ని సాధించాలి.

అటువంటి తీవ్ర వైరాగ్యంతోనే సిద్ధార్థుడు తన లక్ష్యార్థంలో విజయాన్ని సాధించాడు. 'అభావే విరక్తి' అనేది అందరిలో ఉండేది. కాని పరవళ్ళు త్రొక్కే ప్రాయంలో ఉండి, సకల సంపదలకు ఆలవాలమైన సామ్రాజ్యమునకు యువరాజై ఉండి, అందాల సుమబాల యశోధర ఆదర్శమైన ఇల్లాలు కాగా, పాలబుగ్గల తనయుడు రాహుల్ ఊయలలో బోసి నవ్వులతో అలరించుచుండగా- అన్నిటిని తృణప్రాయంగా భావించి, నిస్సంకోచంగా వీడ్కోలు చెప్పి, సత్యాన్వేషణకై, వెనుతిరిగి చూడకుండా, పురోగమించిన బుద్ధ భగవానుని త్యాగనిరతియే వైరాగ్యానికి నిర్వచనం!

- సశేషం

---

## ('అమ్మమాట' - 6వ పేజీ తరువాయి భాగం)

తప్ప, తాలు దంచితే బియ్యం రానట్లు, విషయాదులను మథిస్తే ఆనందం లభించదు. మన జీవితానికి ఆధారం ఎవరై ఉన్నారని ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే, అది కేవలం భగవంతుడే అని గుర్తింపునిస్తారు శ్రీ గురుదేవులు. మన జీవితాలకి సౌభాగ్యం తెచ్చి పెట్టడానికి, 'నువ్వు ఆత్మ స్వరూపుడివిరా, ఆత్మ రతే రతి. కనుక ఈ ఆత్మరతిని మథనం చేయి' అని శ్రీగురుదేవులు ఘోషిస్తున్నారు. దేవతలు అమృతం కోసం మథించినప్పుడు సంతోషమూ, స్పర్థలూ కూడా వచ్చాయి. కాని గురుదేవులు చెప్పినట్లు మనస్సుని మథిస్తే వచ్చే జ్ఞానామృతం చావులేని, మార్పులేని స్థితిని ప్రసాదిస్తుంది.

'ఉన్నది - ఉన్నది' అనే ఉనికి కలిగినది ఏదో అదే 'తాను' అనే ఎరుకని కలిగించేవాడు గురువు. ఇది మథించాలి. జీవిత పరమార్థాన్ని గుర్తించాలి. మనం పొందవలసిన స్థానాన్ని పొందాలి. అటువంటి నిత్య సత్యమైన లీలని అనుభవించటానికి అనేక పండుగలనిచ్చారు మనకి. నూతనత్వమనేది, మన భావనలో రావాలి. జీవితం కాంతివంతమవ్వాలి. ఈ స్థితిని మనస్సు ఎప్పుడు అనుభవిస్తుందో, అదే నిజమైన పండుగ. అఖండ భక్తి, జ్ఞాన వైరాగ్యములను, ఆయురారోగ్యాలను, పాడిపంటలను ప్రసాదించి గురుపాదుకలు సర్వులనూ సర్వదా కాపాడుగాక!!

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

## నింద్రకొలను డాక్టరుగారితో శ్రీబాబు

తమ ధ్యాన సమయంలో డాక్టరుగారు క్షీరసాగరంలో శేషతల్పంపై శయనించి ఉన్న శ్రీమన్నారాయణుని, శ్రీవారి పాదసేవ చేస్తున్న లక్ష్మీ దేవిని దర్శించారు. అంతలో శ్రీమన్నారాయణుని స్థానంలో శ్రీబాబును దర్శించారు. తమ ఈ ధ్యాన అనుభవాన్ని తమ బంధువులకు, ఇతర భక్తులకు తెలుపుతూ డాక్టరుగారు "శ్రీమన్నారాయణుడే మన బాబు. శ్రీమన్నారాయణుని ఆశ్రయిస్తే, ఆయన మనలోని అజ్ఞానమనే దరిద్రమును హరిస్తాడని శ్రీబాబు చెబుతూ ఉంటారు కదా! కనుక శ్రీబాబు దివ్య చరణారవిందాలను మనం ఆశ్రయిస్తే, మన ఇహపర దరిద్రములను తొలగించి మనలను రక్షించగలరు" అన్నారు.



నింద్రకొలను భక్తులతో కలసి డాక్టరుగారు శ్రీదేవి శరన్నవరాత్రి పూజలకు, శ్రీకాళీ జయంతులకు శ్రీబాబు సన్నిధికి వెళ్ళేవారు. శ్రీబాబు దివ్యబోధను అందించే సమయంలో, రామభజన జరిగేచోట హనుమ ఒక మూల కూర్చున్నట్లుగా స్వామి పైనే దృష్టి కేంద్రీకరించి, వారి బోధపై తమ శ్రవణేంద్రియాన్ని, బుద్ధిని నిలిపి వినేవారు. వెంటనే ఏకాంతంలోకి వెళ్ళిపోయేవారు. తత్త్వ పిపాసన గల భక్తులను, యువకులను తమ వద్ద కూర్చోబెట్టుకుని, ఆనాటి బోధలోని విషయాన్ని ప్రస్తావించి, తత్త్వ చింతనలో వారి మనస్సులను లగ్నం చేసేవారు. శ్రీబాబుతోగాని, తోటి భక్తులతోగాని వారెన్నడూ సంసార విషయాలను మాట్లాడేవారు కాదు.

ఆ రోజులలో భక్తులకు శ్రీబాబు దర్శనం చాలా అరుదుగా లభించేది. వారెప్పుడు వచ్చేది, ఎప్పుడు వెళ్ళేది తెలిసేది కాదు. నింద్రకొలను భక్తులు ఎప్పుడు డాక్టరుగారితో కలిసి సత్సంగాలు పెట్టుకొనేవారు. శ్రీబాబు అటువంటి సయమంలో దర్శనం ఇస్తే బాగుండునని అందరికి మనస్సులో ఎంతో కోరికగా ఉండేది. డాక్టరుగారు వారందరినీ ప్రోత్సహిస్తూ "మనందరం కలిసి నిండారిన భక్తి హృదయాలతో సంకీర్తన

చేసుకుందాం. స్వామి దర్శనం కోసం ప్రార్థిద్దాము. పరితపిద్దాము. వారు అవ్యాజ కరుణా స్వరూపులు. మనకు తప్పక దర్శనమిస్తారు" అనిచెప్పి, ఒక నెలలో శుద్ధ ఏకాదశినాడు అందరిని కూర్చోబెట్టుకొని, సంకీర్తన, ధ్యానం చేయించటం మొదలు పెట్టారు. "శ్రీబాబు సాక్షాత్ నారాయణ మూర్తి అన్న సత్యం మనకు ఈనాడు తప్పక ఋజువవుతుంది. ఏకాదశీవ్రతం చేసినవారికి స్వామి దర్శనం తప్పక అవుతుంది" అని ఘంటాపదంగా చెప్పారు.

- సశేషం

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

## నిత్య కార్యక్రమములు -

ఉదయం 4గం.లకు మేలుకొలుపు, సుప్రభాతం.
ఉదయం 5గం. నుండి 6గం. వరకు ప్రార్థన.
సాయంత్రం 6గం. నుండి 7గం. వరకు ప్రార్థన.

## ఆదివారములు -

సాయంత్రం 5గం నుండి 5-30ని॥ల వరకు సంకీర్తన.
సాయంత్రం 5-30ని॥ నుండి 7గం. వరకు ప్రార్థన, సత్సంగం.

## మే 2015

4-5-15 సోమవారం - శ్రీగురుపూర్ణిమ
సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.
13-5-15 బుధవారం శ్రీగురుదశమి; హనుమజ్జయంతి.
సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

## జూన్ 2015

2-6-15 మంగళవారం పూర్ణిమ
సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.
11-6-15 గురువారం శ్రీగురుదశమి.
సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

-గత సంచిక తరువాయి

## విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# కబీర్‌దాస్

కబీర్‌దాస్ ప్రశాంతంగా లోయీని సమీపించి "పిచ్చిదానా! ఎందుకు ఇంతగా దుఃఖిస్తునావు? నీవు చేసింది తప్పకాదు. నీలో ఏ దోషమూ లేదు. క్లిష్టపరిస్థితులలో నువ్వు చక్కటి నిర్ణయం తీసుకున్నావు. భక్తుల సేవయే భగవంతుని సేవ. అనవసరంగా దుఃఖించకు. నీవు పవిత్రురాలవు. అంతేకాదు భక్తులకు ఆతిధ్యమిచ్చే అవకాశాన్ని ప్రసాదించిన తులసీసేర్ కూడ పవిత్రుడే. లేకపోతే మనం ఇంతమందికి ఆతిధ్యం ఇవ్వగలిగేవారమా? అతడు సాక్షాత్తు భగవంతుడే అన్న భావం నాకు కలుగుతోంది. పోదాం పద! నీవు అతడికి మాట ఇచ్చావు. ఇచ్చిన మాటను నెరవేర్చటం మన కర్తవ్యము.



ఇప్పుడు బాగా రాత్రి అయింది. బయట వర్షం పడుతోంది. నేను నిన్ను అక్కడ వదులుతాను. మళ్ళీ నువ్వు బయటకు రాగానే తీసుకుని వస్తాను" అని ఆవిడను గొడుగు పట్టి తులసీ సేర్ ఇంటికి తీసుకు వెళ్ళాడు. తాను వరండాలో నిలబడ్డాడు. లోయీ లోపలికి వెళ్ళింది. తులసీ శేర్ దిగ్భ్రాంతి చెందాడు. ఆమె నిజాయితీకి ఆశ్చర్యపోయాడు. "ఇంత రాత్రి వర్షంలో ఎలా రాగలిగావు?" అన్నాడు. లోయీ తలవంచుకుని "నా భర్త తీసుకుని వచ్చాడు" అన్నది. ఈ సమాధానం శేర్‌ను కలవర పెట్టింది. "నీ భర్తకు ఈ విషయం తెలుసా?" అని ప్రశ్నించాడు". "తెలుసు, జరిగింది అంతా చెప్పాను. సాధు జనులకు ఆతిధ్య మిచ్చేందుకు సహకరించిన మీరు భగవత్స్వరూపులని చెప్పి నన్ను వెంట పెట్టుకు వచ్చారు" అన్నది లోయీ.

తులసీశేర్ ఆశ్చర్యపోయాడు. "నీ భర్త ఎక్కడ ఉన్నాడు?" అని అడిగాడు. బయట వరండాలో నిలబడి ఉన్నారు" అని సమాధానం

ఇచ్చింది లోయీ. తులసీశేర్ బయటకు వచ్చి కబీర్‌ను చూశాడు. ప్రశాంత చిత్తంతో రామధ్యానం చేస్తున్న కబీర్‌ను చూశాడు. పశ్చాత్తాపంతో క్రుంగి పోయాడు. పరమ భక్తుల పట్ల తాను చేసిన అపరాధానికి సిగ్గుపడిపోయాడు. లోయీ పాదాలపై పడి క్షమాభిక్ష కోరాడు. ఆపుకోలేని దుఃఖంతో కబీర్ పాదాలపై పడి "నేను దుర్మార్గుడను. నా పాపానికి నిష్కృతి లేదు. నన్ను క్షమించండి" అంటూ దుఃఖించాడు శేర్.

సూర్యకాంతిలో మంచు గడ్డ కరిగే లాగా కబీర్ దివ్య తేజస్సు ముందు శేర్ కామ వాంఛలు కరిగిపోయాయి. ఆయనలో పరివర్తన కలిగింది. ఊహించరాని తీరానికి జీవితం మలుపు తిరిగింది. బ్రతుకుకు సార్ధక్యం ఏమిటో గ్రహించటానికి మనసు పరితపించింది. కబీర్ ప్రేమగా తులసీశేర్‌ను ఆలింగనం చేసుకున్నాడు. తన సందేశాన్ని ఈ విధంగా అందజేసాడు.

ఘూంఘట్‌కా పట్ ఖోల్‌రే తోహె పియా మిలేంగే
ఘట్ ఘట్ మే సాయీ రహతా కటిన వచన్ మత్ బోల్‌రే
సూనీ మహల్ మేఁ దీప్ విరాజే బాజే అనహత్ ఢోల్ రే
కహత్ కబీర్ సునోభయి సాధో అనహద్ బాజత్ ఢోల్‌రే

"తెరను తొలగించు! నీ ప్రియుడిని (రాముని) పొందగలవు. ప్రతి హృదయంలో భగవానుడు ఉన్నాడు. ఎవరినీ కష్టపెట్టి మాట్లాడకు. అంధకారమైన హృదయంలో దీపం వెలిగించు. అంతా సదా ధ్యానించే ప్రణవనాదాన్ని ఆలకించు" అని జ్ఞాన బోధ చేశాడు.

కబీర్‌దాస్‌కు ఒక కుమారుడు కలిగాడు. అతనికి "కమాల్" అని నామకరణం చేశారు. శైశవ దశలోనే రామనామం చెవిన పడగానే ఏడుపు మానేవాడు. హరికథలు జరిగే చోట నిశ్శబ్దంగా కూర్చుని వినేవాడు. సంకీర్తన జరుగుతూంటే గంతులు వేసేవాడు. అతని భక్తి శ్రద్ధలకు అందరూ ఆశ్చర్యపడేవారు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL